# యుగళగీతం

## గల్పికలు

## తుషార



శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net
ప్రచురణ సంఖ్య: 51

# యుగళగీతం

## (కొంచెం రీమిక్స్...కొంచెం ఫ్యూజన్...)

## తుషార



### జత వెతికిన హృదయానికి..శృతి కలిపిన మురళి

**అనగనగా అమెరికా.** అందులో కాలిఫోర్నియాలోని బే ఏరియాలో ఓ ముచ్చటైన తెలుగు జంట ఉంది. పేర్లు శైలజ. మురళీ కృష్ణ..! తెలుగు.. పేరెత్తగానే.. ఏ తెలుగు.? తెలంగాణానా? రాయలసీమా? కోస్తానా? ఉత్తరాంధ్రానా..లాంటి ఇంతకు ముందెన్నడూ లేని ప్రశ్నలు ఒద్దన్నా అలవోకగా ఆరాకి వచ్చేస్తున్న ఈ "దీక్షా" కాలంలో వీళ్ళ తెలుగుదనాన్ని ఎలా పరిచయం చెయ్యమంటారు? ఇద్దరూ "ప్రస్తుత" ఆంధ్రప్రదేశ్‌లోని చెరో మూల ప్రాంతానికి చెందినవారయినా, తల్లిదండ్రుల ఉద్యోగాల రీత్యా అనేక ప్రాంతాల్లో ఉండటంతో ఆయా యాసలు, పదాలు ఒంటబట్టిన "కలగలుపు" తెలుగని. అమెరికా వచ్చి పదేళ్ళు దాటిందేమో, ఇంగ్లీషు ఫ్లేవర్ కూడా కొంత కలిసిందనే చెప్పాలని నిజాయితీగా ఒప్పేసుకుంటారు. పొలంలో వేసిన పంటనే మళ్ళీ మళ్ళీ వేస్తే భూసారం తగ్గుతుందని మన రైతులు మధ్యలో కొత్త పంట ఎలా వేస్తుంటారో, అలాగే భిన్న వర్గాలు, ప్రాంతాల వ్యక్తులు కలవడం, స్నేహంగా ఉండటం ద్వారా సమాజం మరింత బలపడుతుందనీ, చిన్న చిన్న సరదాలు, మనసుని తట్టి లేపి అనుబంధాలు జీవితానికి మరింత శోభని, ఉత్సాహాన్ని తెస్తాయని మనసు పెట్టి నమ్ముతారిద్దరూ.

ప్రస్తుతం ఓ చిన్నారికి తల్లిదండ్రులు కూడా అయిన ఈ జంట కలిసిన శుభ తరుణం వివరాలు చెప్పాలంటే. ఒకటా రెండా హైదరాబాదులో నాలుగేళ్ళ ఇంజనీరింగ్ ప్రేమ, అనంతరం ఫ్యామిలీ డ్రామా. ఆఖర్న బాజాభజంత్రీలు. చాలా సింపుల్‌గా చెప్పేశాననుకుంటునారా? ఇదే మాట శైలజనో, మురళీ కృష్ణనో అడిగారంటే. అమాంతం వాళ్ళ కాలేజీ రోజులకు వాలిపోయి (ఎంతైనా ప్రేమ పక్షులు కదా!) చుక్కలాంటి అమాయి - చక్కనైన అబ్బాయి అని పాట పాడినట్టు మురిపెంగా చెపుతారు.

"ఇపుడిలా అమాయకంగా కనిపిస్తున్నాడు కానీ ఎంత టెన్షన్ పెట్టాడో? ఆప్యాయంగా, స్నేహంగా ఉంటాడు. మనసు మంచిదని ఇష్టపడేదాన్ని. ఈ గోలేం తనకి పట్టనట్టు. చెంపకి చెయ్యి ఆనించి, చెప్పింది విని, ఒకటో రెండో మాటలు జవాబిచ్చేవాడు. ఏమీ తేల్చడేమిటని ఒక్కోసారి కోపం. మరోసారి ఏడుపూ వచ్చేవి.

ఓ రోజు బస్సులో కాలేజీకి వెళుతున్నప్పుడు ఖాళీగా సీటు ఉంటే ఇద్దరం కూర్చున్నాం.. మామూలే..! కూర్చుని ఎటో ఆలోచిస్తున్నాడు. లాభంలేదని కిటికీలోంచి తల బయట పెట్టి ఆకాశం వంక చూశాను. సడన్‌గా ఉలిక్కిపడి. 'ఏంటి ఏం చేస్తున్నావ్?' అన్నాడు కంగారుగా... ఏ మేఘం మీద విహరిస్తున్నావో చూస్తున్నానని చెప్పాను సీరియస్‌గా! ఏం తొణకలేదు.. బెణకలేదు.. 'అరే! నేనొకడినేనా.. ఇద్దరం విహరిస్తున్నామనుకున్నానే..' ఎంత క్విక్‌గా సమాధానం చెప్పాడో, ఆ స్పీడుకి నేనే ఆశ్చర్యపోయా.. ఈ సెన్సాఫ్ హ్యూమర్. ఎప్పుడూ ఎందుకుండదని అడగాలనిపించింది. కానీ. తనిచ్చిన రిప్లయి ప్రకారం ఫుల్‌గా కమిట్ అయినట్టా కానట్టా, లేక జోక్ గా అన్నాడో తెలిక కన్ఫ్యూజ్ అయిపోయాన"ని శైలజ చెపుతుండగానే,

ఓ కొంటె నవ్వుతో అందుకునే మురళీ కృష్ణ, "అప్పుడప్పుడూ ముత్యంలాంటి మాటలు అలా వస్తుంటాయి.. నీ కన్ఫ్యూజన్, అందులోంచి వచ్చే కోపతాపాలే నా వేడుక.. మరి!" అని శైలజ వంక ప్రేమగా చూస్తూ.. "మల్లెపువ్వులా నవ్వుతుంది. గలగలా మాట్లాడుతుంది. పసిపిల్లలాంటి మనసుంది. కానీ ముక్కు మీద కోపం మాత్రం కంగారు పెట్టేది. బహుశా మా ప్రేమలో ఎక్కువగా నాదే ప్రేక్షక పాత్ర కావడం వల్లనేమో.. ఈ ప్రేమాయణాన్ని శైలూ కంటే నేనే ఎక్కువ ఎంజాయ్ చేశాననిపిస్తుంది....!

ప్రేమ విషయం డైరెక్ట్‌గా చెపితే ఎలా రియాక్ట్ అవుతుందోనని, ఉన్న ఫ్రెండ్షిప్ కూడా పోతుందేమోనని కామ్‌గా ఉండేవాడిని. ఇంకా చదువుకునే రోజులే అవటం వల్ల కూడా కమిట్మెంట్ మీద జంకు ఉండేదనుకోండి. కానీ మధ్య మధ్యలో రెండు మూడు చిన్న చిన్న ప్రయత్నాలు చెయ్యకపోలేదు. అందులో ఒకటి 'పిలిచిన మురళికి, వలచిన మువ్వకి ఎదలో ఒకటే రాగం...' అనే పాట నేను పదే పదే వాక్‌మేన్లో వింటూ శైలూకి కూడా వినిపించే ప్రయత్నం చేశా... విన్నది... ఏం లాభం! ట్యూబ్ లైట్... ఇంత పాతపాటలు వింటావేంటి? కొత్తవి విను అని విసుక్కుంది.. పైగా టెన్షన్ పెట్టానని ఇప్పుడీ కంప్లయింట్ ఒకటి... "

అని ముద్దుగా విసుక్కోవడం చూసిన వాళ్ళెవరైనా సరే.

"ఇంతకీ ఫైనల్‌గా ఎలా తేల్చుకున్నారో చెప్పండి" అని అడగకుండా ఉండలేరు!

ఆ ప్రశ్న వేసిన వాళ్ళ మొహం వంక తేరిపార చూసి, ముసి ముసి నవ్వులు రువ్వుతూ, "ఓ ...అదా! ఒంట్లో బాగోక వారం రోజులు కాలేజీకి వెళ్ళకపోతే, ఎనిమిదో రోజు ఓ పుస్తకం పట్టుకుని సరాసరి ఇంటికే వచ్చేసాడు... అమ్మకి, డాడీకి ఏం చెప్పాలో తెలీలేదు. మాట్లాడడు.. ఎంతోసేపటికీ కదలడు. వాలకమేమో కదిపితే చాలు కళ్ళలోంచి నీళ్ళొచ్చేట్టు ఉంది... అప్పటికీ కంగారులో నేనే గందరగోళంగా మాట్లాడి, చేతిలో ఉన్న పుస్తకం లాక్కుని పంపించేశాను. తరువాత అందులో చూశాను.. తను రాసిన మొదటి ప్రేమ లేఖ! పెద్ద ఉత్తరం అనుకునేరు.. మూడు పదాల్లో సూటిగా చెప్పాడు... నన్ను ట్యూబ్ లైటు అన్నాడు కానీ.. అమ్మాయిలతో.. హింట్ ఇచ్చాను.. సింబాలిక్‌గా చెప్పాను అంటే నడవదు... ఒక జీవితానికి సరిపడా పడాల్సిన ఫౌన్డేషన్‌కి సంబంధించిన సన్నివేశం అది. కనీసం మొదటి సారయినా మనసు తీరా చెప్పకపోతే ఎలా..? ఇంకో మాట చెప్పనా... మురళి తన ప్రేమని బలంగా వ్యక్తీకరించింది అదొక్కసారే!.. గత పదేళ్ళుగా, నువ్వంటే ఇష్టమనో, ప్రేమిస్తున్నాననో కొన్ని వేలసార్లు నేనే చెప్పి ఉంటా" అని కంప్లయింట్ చేసే శైలజని

"నేను మొదటి సారి చెప్పినప్పుడే లైఫ్‌కి సరిపడా ఎమోషన్తో చెప్పాను.. ఈ వడ్డీ లెక్కలు నా వల్లకాద"ని ఆట పట్టిస్తాడా చెలికాడు.

ఏది ఏమయితేనేం! జత వెతికిన హృదయానికి... శృతి కలిపే మురళి దొరికింది అని అభినందించే లోపు,

"మీరలా అప్పుడే ఫులిస్టాప్ పెట్టేయ్యకండి. మా ప్రేమకి గుర్తుగా, హైదరాబాద్ ప్రయాణం కట్టి, ఏ బస్సులో అయితే కాలేజీకి వెళ్ళేవాళ్ళమో అలా... ప్రయాణం చేసి మా ప్రేమకి వేదిక అయిన కాలేజీకి వెళ్ళి, క్యాంటిన్లో కబుర్లు చెప్పుకుని, క్లాసు రూములో కూర్చుని పాత రోజుల్ని పలకరించి రావాలని ఎన్నెన్నో ప్లాన్స్ వేసుకుంటున్నాం. డ్రయివ్ చెయ్యడం కష్టమేమో కానీ... కుదిరితే బైక్ మీద కుదరకపోతే కార్లో నెక్లెస్ రోడ్‌కి వెళ్ళి, వస్తూ వస్తూ బిర్లా టెంపుల్ లో కూర్చుని, ఆ పాలరాతి కాంతిలో... మా ప్రేమ చిగురించిన నగరం మిలమిలలు చూస్తూ. మా కంటి వెలుగుకి అమ్మా నాన్న ప్రేమ ఇక్కడే పుట్టిందని పరిచయం చెయ్యాలనుంద"ంటారు.. ప్రస్తుతానికి శైలజ - మురళీ కృష్ణలనిక.. అదే నువ్వు, అదే నేను .. అదే గీతం అని పాడుకోనిచ్చేద్దాం...ఈ ఆంధ్రా - అమెరికన్ జంట ఆలోచనలు, ఆవేదనలు, అంతరంగాలని ఆవిష్కరించే ప్రయత్నంలో...

✡ ✡✡

# కనులు మూసి...మనసును తెరచి ... !

**చాలా ఏళ్ళ క్రితం,** బాగా పరిచయం ఉన్న ఒక కుర్రాడిని,

"నీ కల ఏమిటి"

అని అడిగినపుడు,

"పరదేశ్ సినిమాలో షారూక్ ఖాన్‌లా కన్వర్టబుల్ కార్లో ... వంద కిలోమీటర్ల స్పీడ్‌తో, చుట్టుపక్కల వాళ్ళు నా వైపు తిరిగి చూడకుండా ఉండలేక పోయేంత మ్యూజిక్‌తో.... అమెరికా రోడ్ల మీద కారు నడపడం" అని చెప్పాడు.

అమెరికా వొచ్చి సెటిల్ అయిన చాలా ఏళ్ళ తరువాత " ఇంకా 'కారు' కల వొస్తోందా" అంటే,

"రేర్ గా వొస్తూంటుంది, కానీ ఇవ్వాళ్‌రేపు స్పీడ్‌గా వెళుతూ నేనొక్కడినే కాదు, నా వెనకాల కాప్ కారు కూడా కనిపిస్తోంది...జాగ్రత్త పెరిగిందంటారా...మీరిలా సడన్‌గా అడుగుతుంటే టెటెన్షన్‌గా ఉంది.....అలాంటి కలలు కనే వయస్సయిపోయిందా? వయస్సు శరీరానికి కానీ మనసుకి కాదంటారే... నాకు కాప్ కనిపిస్తున్నాడంటే, మనసు వయస్సుని బట్టి రియాక్ట్ అవుతున్నట్టేగా ..అక్కడి నుంచేగా మెదడుకి సిగ్నల్స్ వెళ్ళేది...? "

ఇలా.. రకరకాల లాజిక్కులతో, ముందు ముందు కనీసం కలల్లోనైనా క్రేజీగా ఉండలేనేమోనని డీలా పడేసరికి సముదాయించలేక నా పనయింది.

కవితకి ఊహ అందం అంటారు... అయితే కలకి మాత్రం అమాయకత్వమే ఆక్సిజన్! అందుకే క్రికెట్ బౌండరీలకు మించిన సరిహద్దులు పెద్దగా తెలియని రోజుల్లో కలలు కూడా స్వేచ్ఛగా పరుగులు పెడతాయి. మన ఆంధ్రా - అమెరికన్ జంటలోని మురళీకృష్ణ ఇందుకు తనో చక్కటి ఉదాహరణగా చెపుతాడు.

"కలలు అంటే ఏమిటనుకుంటున్నారు...? కళ్ళు మూసి, మనసు తెరవడం ! అందులోను చిన్నప్పటి కలలు ఎంత అందంగా ఉంటాయి...చందమామ నెక్కి గంతులెయ్యాలని కచ్చితంగా ఏదో ఓ పసి మనసులో పుట్టిన కోరికే మనిషిని అక్కడికి చేర్చింది. అకాశానికి నిచ్చెనలేసే గుండెధైర్యం ఇప్పుడెక్కడ ఏడుస్తుంది... చిన్నప్పటి కలలే ఇప్పటికీ నా గైడింగ్ ఫోర్స్"

అనే అతని మనసు "కలల" పేరెత్తగానే, చిట్టి గువ్వలా, చిన్నారి పడవలా... పుట్టి పెరిగిన ఊరు పరుగెత్తిపోతుంది. కృష్ణాజిల్లాలోని ఓ పల్లెటూరికి చెందిన రెండెకరాల రైతు కుటుంబంలో పుట్టిన మురళికి, మరో ఇద్దరు తోబుట్టువులు కూడా ఉన్నారు. వ్యవసాయంతో పాటు, గ్రామీణ తపాలా శాఖ కార్యాలయంలో తండ్రి పోస్టుమాస్టర్‌గా కూడా పని చేసేవారు. పిల్లలు వృద్ధిలోకి వొస్తున్న కొద్దీ, సంపాదన సరిపోక, డిపార్ట్‌మెంటల్ పరీక్షలు రాసి, ట్రాన్సఫర్ల మీద ఊళ్ళు తిరిగిన విషయం అటుంచితే, మురళి చదువు దాదాపు హైస్కూలు దాటే వరకు అదే ఊరిలో సాగింది.

స్కూల్ అయిపోగానే, అమ్మ పెట్టింది తిని, పని ఏమైనా ఉంటే సాయం చేసి, చీకటి పడక ముందే హోం వర్కు చేసుకుని, ఆరయ్యే సరికి చెరువు కట్ట మీద ఉన్న పంచాయితీ ఆఫీసులో వార్తలు వినటానికి పరుగులు పెట్టేవాడు. అవేవో ఇంట్లో వినమని అమ్మానాన్నా చెప్పినా, అక్కడ వింటే కానీ తృప్తి ఉండేది కాదట!

"రేడియోలో ప్రాంతీయ వార్తలు, జాతీయ వార్తలు అయిపోగానే మా ఊర్లో చెరువు కట్టమీద అన్ని విషయాల మీద చర్చలు నడిచేవి. నన్నడిగితే ఇప్పుటి తెలుగు మీడియాలో వొస్తున్న చర్చల కంటే వాళ్ళే నయం! అక్కడ పోగయ్యే వాళ్ళంతా మామూలు ప్రజలు కదా... అభిమానాలు ఉంటే ఉండొచ్చుగాక, కానీ మరీ ఇంత అన్యాయంగా మాట్లాడే వాళ్ళు కాదు. ఇక నా ఆసక్తి ఏమిటంటే, ఒక గంట

గంటన్నర టైంలో జాతీయ, రాష్ట్రీయస్థాయి నుంచి, మా ఊళ్ళో విషయాల వరకు, పరమ పవిత్రమైన బోధనల నుంచి, సినిమా గాసిప్‌ల వరకు అన్నీ, రకరకాల కోణాల్లో తెలిసిపోయేవి. మీరు నమ్ముతారో లేదో, మా నాన్న ఉద్యోగ రీత్యా మేం వేరే ఊళ్ళకి మారినా, తాతయ్య వాళ్ళు అక్కడే ఉండటంతో శలవలకి వొచ్చేనపుడు కూడా వెళ్ళేవాడిని, కాకపోతే జనాలు అప్పటికి టి.వి. కి మారిపోయారు.''

అంటూ కంటిన్యూ చేసే మురళిని,

''బాబూ! ఇంతకీ నీ కల ఇంకా అగుపించలేదేంటి?'' లాంటి ప్రశ్నలు వేస్తే మాత్రం..

''లేడీస్‌కి తొందరెక్కువండీ, మా శైలూ కూడా ఇంతే.. అదే మా ఆఫీసులో ఏ లేడీ కొలీగో అనుకోండి, పీకల మీద కూర్చుని పని చేయించుకు పోతుంది.''

అక్కడికే వొస్తున్నా...

''మా ఊర్లో కొంచెం డబ్బున్న కుటుంబాలు నాలుగైదు ఉండేవి. వాళ్ళలో ఓ కుటుంబానికి చెందిన అబ్బాయి చదువుకుని అమెరికా వెళ్ళి అక్కడే సెటిల్ అయ్యాడు. ఈ ఇరవై సంవత్సరాలలో చాలా మంది వచ్చారనుకోండి, కానీ నేను చెపుతున్నది పాతికేళ్ళ పై మాటే. నాలుగో, ఐదో చదువుతూ ఉన్నాను. ఓసారి ''అమెరికా అబ్బాయి'' ఊరొచ్చాడు. ఇక మా ఊళ్ళో సందడీ చూడాలి....అతన్ని ఎంత అపురూపంగా చూసారో చెప్పలేను. ఎదురుపడి పలకరించినా చాలు.. జనాలు తెగ పొంగిపోయే వాళ్ళు. ఊళ్ళో గుడికెళ్ళినా, షాపుకెళ్ళినా, రోడ్డు మీద కొచ్చినా...రాజ భోగం అంటారు చూశారా అట్లా అన్న మాట! చెరువు కట్ట మీద ఉన్న పంచాయతీ ఆఫీసు దగ్గరయితే, అతని సంపాదన గురించి, కార్ల గురించీ ...ఒకటేమిటి లెండి రక రకాల డిస్కషన్స్.. ఎంతయినా చిన్నతనం కదా, ఇవన్నీ నా మీద బాగా ప్రభావం చూపాయి. అప్పటికి నేను విజయవాడ దాటి హైదరాబాద్ లాంటి సిటీ కూడా చూడలేదు. నన్ను స్కూల్లో మెచ్చుకునే వాళ్ళు, బంధువుల్లోను బుద్ధిమంతుడనే వాళ్ళు, ఊళ్ళోను మంచి పిల్లాడనే వాళ్ళు, కానీ ఎవరూ ఇంత అపురూపంగా చూడలేదు కదా. అనేది నాలో మొదలైంది. నాకు తెలిసి నా ''అమెరికా కల''కి మొదలు ఇదే ! వయస్సు పెరుగుతున్న కొద్దీ ఇది బలమైంది కానీ తగ్గలేదంటే ఎంత గాఢమైన ముద్రపడిందో అర్థం చేసుకోండి.''

అంటూ తెరతీసే మురళి కథలో తమాషా విషయాలు కూడా ఉన్నాయి. ఆ వయస్సులో అమెరికా ఎలా ఉంటుందో కూడా తెలియక పోయినా, ''అమెరికన్ రి రిటర్న్‌డ్'' గా వస్తే తనతో పాటు చదువుకునే స్నేహితులు ఎలా వింతలూ విశేషాలు అడుగుతారు, వాళ్ళ ముందు ఎలా ఫోజు కొట్టొచ్చు, టీచర్లు ఎలా మెచ్చుకుంటారు, అమ్మానాన్న, చెల్లెళ్ళు ఎలా అందరికీ గొప్పలు చెప్పుకుంటారు, సినిమాల్లో చూపించే సూట్లు, బూట్లు, కార్లు తన సొంతమే అయినట్టు..ఇలాంటి పగటి కలలు కూడా కనేవాడట. పైగా అవన్నీ అసాధ్యమేమోనని ఒక్క రోజూ అనిపించకపోవడం పరమ ఆశ్చర్యం అంటాడు. చిన్నప్పుడు ఎన్ని కష్టాలున్నా, పెద్దయిన తర్వాత హీరో గొప్పవాడైన సినిమాలు ఎన్ని చూడలేదు.....? అని తనను తను కౌన్సిల్ చేసుకున్న అమాయక సందర్భాలు చెప్పి, అది ఆ వయస్సుకే సాధ్యమనే స్టేట్‌మెంట్లు ఇస్తాడు. బహుశా ... నలుగురిలో గుర్తింపు పొందాలనే గుణం తన వ్యక్తిత్వంలో భాగమని .. అందుకే ''అమెరికా అబ్బాయి'' సిట్యుయేషన్ పట్ల అంత మోజు కలిగిందని ఈ మధ్యనే ఓ కంక్లూషన్‌కి కూడా ఒచ్చినట్టు సెలవిస్తాడు.

అలా అని, ఊరికినే కలలు కని, పోసుకోలు కబుర్లు చెపితే అవి ఎలా నిజం అవుతాయి.... కల కనగానే సరికాదు, దాని వెంట పడాలి! దాని అంతు తేలేదాక వదలనని పంతం పట్టాలి, ప్రపంచంలో తమ కలల్ని సాధించుకున్నవాళ్ళెవరైనా కూడా ఇదే సిద్ధాంతాన్ని పాటించి ఉంటారని బల్లగుద్ది మరీ చెపుతాడు మురళీ కృష్ణ. నిజానికి, ఆ రోజుల్లో వాళ్ళున్న పరిస్తితికి అలాంటి కలలు కనే తాహతు కూడా లేదంటాడు. రెండెకరాల రైతుకి తన కొడుకుని అమెరికా పంపడం, ఇద్దరాడ పిల్లల పెళ్ళిళ్ళు చెయ్యడం ఎంత కష్టమో తెలియంది కాదు కదా! అలా అని కొడుకు ప్రతిభని, సామర్థ్యాన్ని కూడా తండ్రి నిరుత్సాహ పరచలేక సతమతమయ్యారట. పోనీ ... డబ్బు ఎత్తి పంపే స్తోమత కూడా లేదు!

పెద్ద చదువులు చదువుతానని మీ నాన్నని అంత కష్టపెట్టకపోతే, ఏదో ఉద్యోగం వెతుక్కుని చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేసి బతకరాదా.. అన్నవాళ్ళూ, పోనీలే కుర్రాడు కష్టపడి చదువుతున్నాడు, సాయం చేస్తే పైకొస్తాడని చేసిన వాళ్ళూ ఉన్నారు. ఉన్న రెండెకరాల్లో ఎకరం అమ్మితే కానీ బిటెక్ పూర్తి కాలేదు. ఉన్న డబ్బంతా మురళి చదువుకే ఎక్కువగా వాడటంతో, అతని చెల్లెళ్ళు తమ చదువులకి చాలా సర్దుకోవాల్సి వొచ్చింది. ఈ ఎదిగే క్రమంలో చెల్లెళ్ళ భవిష్యత్తు, తల్లిదండ్రుల పెరుగుతున్న వయస్సు గుర్తొచ్చినపుడు అందరినీ ఇబ్బంది పాలు చేస్తున్నానా? నా కల నెరవేర్చుకోవడానికి స్వార్థంగా ప్రవర్తిస్తున్నానా? అని ఉద్వేగానికి లోనయిన క్షణాలూ అనేకమట...

ఏది ఏమయినా అనుకున్నది సాధించి తీరాలని గట్టి పట్టుదల!

'ఇప్పుడలాంటి పంతం పట్టలేనేమో.. అప్పుడప్పుడూ ఆలోచిస్తే సిల్లీగా కూడా అనిపిస్తుంది... కానీ ఆ రోజుల్లో అలా అనిపించలేద'ంటాడు. చదువు పూర్తయిన తర్వాత, అంచలంచలుగా వచ్చిన అవకాశాలూ, మధ్య తరగతికి కలిసి వచ్చిన "సాఫ్టవేర్" కాలంతో, అనుకున్న అమెరికా... భార్యతో సహా వచ్చాడు. నిలదొక్కుకున్నాడు. టైం బాగుంది కాబట్టి సరిపోయింది, తేడాలొచ్చి ఉంటే తనను నమ్ముకున్న వాళ్ళని ఎలా నిలబెట్టే వాడినని, ఇప్పుడు తలచుకుంటే భయమేస్తూ ఉంటుందని మురళీ ఎప్పుడు చెప్పినా ...

'కాలం ఎప్పుడూ ఆగిపోదు. ఇలా కాకపోతే మరోలా ఉండే వాళ్ళం. బతకడం మానేస్తామా, ప్రపంచం అక్కడే ఆగిపోయేదా ? పైకి ఇలా కనిపిస్తాడు కానీ, ఈ మురళీ చిన్న విషయానికి కూడా కదిలిపోతాడు. నేనే నయమ'నే శైలజ అంతటితో ఆగకుండా...

"అమ్మయ్య! మొత్తానికి అమెరికాలో సెటిల్ అయ్యాడు కదా... కల సాధించినట్టే" అని పొరపాట్న అనుకునేరు... తన చిన్ననాటి కలే ఇప్పటికీ డైరక్షన్ చేస్తోందని ముందే చెప్పాడు కదా. వాళ్ళ ఊరివాళ్ళు ఆయన్ని గుర్తించి, ఆకాశానికెత్తే వరకు కల నిజమైనట్లు లెక్క కాదు. తన చిన్నప్పుడు వాళ్ళ ఊరిలో "ఊరికొక్కడు". ఇప్పుడు మాట వరసకి వంద మంది ఎన్నారైలు! వాళ్ళందరి కంటే మంచి పనులు చేస్తే గాని పేరు రాదంటాడు. మనిషికి సంపాదన ఎంత ఉన్నా తన సొసైటీలో గుర్తింపు లేనిదే విలువ లేదంటాడు. ఇండియా వెళ్ళాడంటే చాలు ఎక్కడ లేని వాళ్ళని పోగేసి కలిసి వొస్తాడు, ఖర్చు పెడతాడు. ఎంతకాలం ఈ పని చేస్తాం. వేరేవాటికి ఇప్పటి నుంచే నిచ్చెనలెయ్యాలంటాడు.

"వీటన్నిటీ వల్ల స్ట్రెయిన్ తప్ప ఏమీ జరగదు ..హాయిగా ఉన్న ప్రాణానికి లేని పోని హంగోవర్లు, ఫాన్సీలు ఎందుకో" చెప్పమంటుంది శైలజ.

శైలజకి ఏమీ అర్థం కాదని, చదువుకుని ఉద్యోగం చేస్తోంది కానీ, ఆమె ఆలోచనాపరిధి ఇల్లు, మాల్, ఉద్యోగం, కుటుంబం దాటి పోదంటాడు. అమెరికాలో బోలెడన్ని డబ్బులు సంపాదించి, ఆంధ్రాకి వెళ్ళి సినిమాలు తియ్యాలని, ఎమ్మెల్యేలు, ఎం.పి లు అవ్వాలని, బిజినెస్ పెట్టాలని... నలుగురూ తమ వంక చూసే స్థాయికి ఎదగాలనుకునే వారందరితో మాత్రమే తన ఫ్రీక్వెన్సీ కలుస్తుందనేది మురళీ నమ్మకం ! వీళ్ళందరూ ఇక్కడి నుంచి తీసుకెళ్ళిన డబ్బులు రెండింతలు చెయ్యాలని అక్కడికి పోవడం లేదు, ఒక వేళ డబ్బు పోయినా, కలగన్నది సాధించామనే ఫీలింగ్, సాహసం చేసే సత్తా ఇచ్చే కిక్ ....వేరేదేదీ ఇవ్వదు, లైఫ్‌కి అది చాలని వాదిస్తాడు మురళి.

ఇవన్నీ సరే కానీ, మన అమ్మాయి "ఐ యాం ఎ ప్రిన్సెస్" అంటోంది...మరి ఈ కలల రాణికి ఏం సలహా ఇస్తావని శైలజ ఉత్సాహంగా అడిగితే,

... "వెంటనే బ్రహ్మాండమైన డ్రస్ ఒకటి కొని, టియరా.. లేకపోతే కిరీటం ఏదో అంటారు కదా! అవన్నీ పెట్టేసి వీకెండ్‌లో ప్రిటెండ్ ప్లే చేద్దాం. వాళ్ళ డాడ్‌తో ఆడిందంటే, మూడో రోజుకి ఆ బుర్రలేని మహారాణీ పారిపోతుంది! పాపం మా నాన్నకి ఇంత తెలివి లేదు కదా శైలూ ?!"

✡✡✡

# మంచి భర్తలు!

"By all means marry. If you get a good wife, you'll be happy. If you get a bad one, you'll become a philosopher" అన్నాడట ప్రముఖ గ్రీకు తత్వవేత్త సోక్రటీస్. ఎందుకో కానీ ఈ వాక్యాలు చదివినప్పుడల్లా.. సోక్రటీసుకి తన 'హోం' డిపార్టుమెంటుతో విపరీతమైన సమస్యలు ఉండటం వల్లనే అంత గొప్ప తత్వవేత్త కాగలిగాడా.. అనే సందేహం రాకుండామాత్రం మానదు. సోక్రటీసు ఎలాగూ బతికొచ్చి తన ఈ సిద్ధాంతానికి సంబంధించిన "తర్కాన్ని" వినిపించలేడు కాబట్టి. కొంచెం ఫిలసాఫికల్‌గా మాట్లాడే మగవాళ్ళని గమనించడం మొదలుపెట్టాను. ఏం ప్రయోజనం లేదు. నాకు తెలిసిన అలాంటి మగవాళ్ళ భార్యలందరూ ఉత్తమ ఇల్లాళ్ళు. నిజం చెప్పాలంటే ఆ భర్తలకే తమ భార్యలంటే కొంచెం విసుగు లేదా ఏదో కంప్లయింట్.. ఇది గమనించిన తరువాత, పాత సందేహం పోయి మరి భర్త 'bad one' అయిన ఇల్లాళ్ళందరూ గొప్ప తత్వవేత్తలు ఎందుకు కావడం లేదు. భారతదేశం ఎందుకని గొప్ప మహిళా తత్వవేత్తల భూమి కాలేకపోయింది.. లాంటి ప్రశ్నలు మొదలయ్యాయి.

ఇక లాభం లేదనుకుని ఓ స్నేహితుడిని ఇదే విషయం అడిగితే.

"కళ్ళకి కనపడేవన్నీ నిజాలు కావు.. నువ్వు చెప్పే ఉతమ ఇల్లాలు 'bad one' కాదని ఎలా చెప్పగలవు? నువ్వు భర్తల వైపు నుంచి ఆలోచించలేదు. కాబట్టే సోక్రటీస్ అర్థంకాలేదు.. ఇది man to man మాట్లాడుకోవాల్సిన టాపిక్... ఈ టాపిక్... నీతో మాట్లాడి ప్రయోజనం లేదు. నీకర్థం కాదు"

అని ఫోజు కొట్టాడు.

సోక్రటీస్ ఎప్పుడో చెప్పిన వాక్యాలకి నా మానాన నేను నిర్వచనాలు ఇచ్చుకుంటూ పోతే సరిపోదు. ప్రతి తత్వవేత్త ప్రతిపాదించే విషయాల వెనుక అనేక తిరకాసులుంటాయని తెలిసినప్పటికీ మనిషి "తుంటరి"జీవి కదండీ నా బుర్ర ఆలోచించడం మానలేదు. దానికి అర్థమయినంత వరకు భార్య మంచిది అయినా కాకపోయినా భర్తకి ప్రయోజనమే! తేడా ఏమిటంటే, కొంతమంది ఆనందంగా ఉంటే, మిగతావాళ్ళు ఫిలసాఫికల్‌గా పేరు తెచ్చుకుంటారు. అదే మహిళలనుకోండి. మంచి భర్తలు ఉన్న వారికిపర్వాలేదు కానీ, 'bad one' బారిన పడినప్పుడు తాత్వికంగా అయిపోయేంత వెసులుబాటు వాళ్ళ జీవితాల్లో సాధారణంగా మిగలదు. ఆ టైము లేకే ఉత్తమ మహిళా తత్వవేత్తలు ప్రపంచానికి పరిచయం కాలేకపోతున్నారు.

"అమ్మయ్య! ఓ గొప్ప విషయమర్థమైపోయింది" అన్న సంతోషంలో మన "బే ఏరియా" శైల - మురళీ కృష్ణలు మా ఇంటికి వచ్చినప్పుడు, ఫిలాసఫీ బాగా తెలిసిన వ్యక్తిలా.. నా లాజిక్ అంతా చెప్పుకొచ్చాను.

అంతా విన్న శైలజ

"నేనొప్పుకోనండీ! మంచి భర్తలు ఉన్న భార్యలందరూ కూడా. ఎప్పుడూ ఆనందంగా ఉండలేరండీ... కాబట్టి మీరా ఎగ్జంషన్ ఇవ్వడానికి ఆలోచించాల్సిందే అటు తత్వవేత్తలూ కాలేకపోతున్నాం. ఇటు ఆనందమూ పూర్తిగా లేదు. ఇక్కడ కూడా మనకి లాసే!" అంది.

ఓ రెండు నిమిషాలు నాకేం పాలుపోలేదు. నా క్వశ్చన్ మార్క్ మొహం చూసిన శైలజ. 'మంచి భర్త' నుంచి ఎదురయ్యే కష్టాల గురించి మధ్య మధ్యలో మురళీ కృష్ణ వంక చూస్తూ వెళ్ళబోసుకుంది.

శైలజ వాళ్ళ అమ్మా నాన్న, అత్తమామగార్ల దగ్గరనుంచి అమెరికా వచ్చిపోయే చుట్టాల వరకు "అబ్బాయి బుద్ధిమంతుడు. బాగా చదువుకున్నవాడు. అమ్మాయిని బాగా చూసుకుంటాడు. అమెరికాలో అంత పెద్ద ఉద్యోగంలో ఉన్నా ఆడ పని, మగపని అనుకోకుండా

సాయంచేస్తాడు. ఎంతో అదృష్టం చేసుకుంటే తప్ప దొరకని భర్త." అని ప్రపంచం అంతా ఊదరకొడుతుంటారు. అయిన వాడికి. కాని వాడికి, ఊళ్ళో వారికి ఈ విషయం చెపుతారు కానీ, శైలజ మాటకొచ్చే సరికి చక్కటి పిల్ల, భర్త అంటే పంచప్రాణాలు, చిన్న కూతురిని చూసుకుంటూనే... ఇల్లూ, ఆఫీసు. అన్నీ సంభాళించుకుంటోంది... పాపం సాయంత్రానికి అలసిపోతుంది. అయినా సరే రెస్టు తీసుకోదు. మురళీ ఏ పని చేసినా అడ్డు చెప్పదు. ఎంతో పుణ్యం చేసుకుంటే తప్ప అలాంటి భార్య దొరకదు.. అని పొరబాటున కూడా ఏ నోటి వెంటా రాదట!

పెద్ద గీత ముందు చిన్న గీతలా.. అసలిలాంటి మంచి ట్యాగ్ ఉన్న వాడిని పెళ్ళి చేసుకోవడం వల్ల తన కున్న కొద్దో గొప్పో మంచి లక్షణాలకి నలుగురిలో విలువ లేకుండా పోయిందని. నలుగురు కొత్త ఫ్రెండ్స్ మధ్యకి వెళ్ళినా, ఏ కొత్త సర్కిల్‌లో అయినా అందరూ తన చుట్టూనే చేరడం, అప్పుడప్పుడూ తనని ఆత్మ న్యూనతకి కూడా గురి చేస్తూంటుందని తన సహకారం, సలహా, సమర్ధన మురళి వేసే ప్రతి అడుగులో ఉన్నప్పటికీ, అతని ఇమేజ్ కారణంగా తనకి తగిన గుర్తింపు రావడం లేదంది శైలజ.

శైలజ వాళ్ళ ఆఫీసులో పని చేసే జేమ్స్, వాళ్ళ ఆవిడ వంట చేసే రోజున ఆఫీసులో కనీసం పదిమందికయినా ఆ విషయం తెగ ముచ్చట పడుతూ చెపుతాడని, తను రోజూ వంట చేసినా దానికే గుర్తింపూ ఇవ్వని మురళికి అంత గొప్ప భర్తగా పేరుండటం అప్పుడప్పుడూ అన్యాయంగానే తోస్తోందట. పైగా ఈ మధ్య కాలంలో ఎవరైనా స్టీరియోటైపులా మాట్లాడితే అరికాలి మంట నెత్తికెక్కుతోందని చెప్పింది.

శైలజ సమస్య మీద తనకి చాలా సానుభూతి ఉందని, కనుక తన వాదనతో విభేదించనని అంటాడు మురళి. కాకపోతే ఇండియన్ మేల్స్ ఇంటి పనుల్లో మైనారిటీలు కాబట్టి వారికి 'మన సొసైటీ'లో తొందరగా రికగ్నిషన్ దొరికిన సందర్భాలలో మెజారిటీలైన మహిళలు సహనంతో ఆవేశాలకు లోను కాకుండా డిగ్నిటీగా ఉండాలని, అర్థం చేసుకోవాలని సెలవిస్తూ...

"నా చేతిలో మంత్రదండంలాంటిది ఏదైనా ఉంటే.. శైలజ శతకం... అని ఒకటి ఈ పాటికి అందరి చేత రాయించి ఉండేవాణ్ణి... ఆమె గొప్పతనాన్ని నేనేమైనా కాదన్నానా... అంత సాహసం చెయ్యగలనా... మంచి భర్తవలన మీకు కలుగుతున్న అసౌకర్యానికి సారీ యువర్ హైనెస్!" అని కొంచెం డ్రమటైజ్ చేసి...

"మన సొసైటీ అలాంటిది. మహిళలకి అంత త్వరగా గుర్తింపునివ్వదు. అందుకు బాధపడి ప్రయోజనం ఏమిటి? మీరు చెప్పండి..." అన్నాడు మురళీ కృష్ణ మధ్యలో నన్ను జోడిస్తూ....

"అదే మరి! పోనీ గుర్తింపు ఇవ్వొద్దు.. కానీ హర్టు చెయ్యొద్దు కదా! ఈ శతకాలు, సహస్రనామాలు ఇలాంటి వేళాకోళాలే వద్దనేది. నేను సొసైటీ ఫెయిర్‌గా ... లేదంటున్నాను. నువ్వూ నేను ఈక్వల్లీ టాలెంటెడ్ అయినప్పుడు.. ఇంట్లో నుంచి బయటివాళ్ళవరకు కేవలం జెండర్ కారణంగా నిన్ను ఎక్కువచేసి చూడటం బాలేదంటున్నాను. ఈ సమస్య పరిష్కారానికి ఏం చెయ్యాలో చెప్పకుండా ఇలా మాట్లాడితే నాకు కోపం వస్తుంది. మీ ఆయన చాలా మంచివారు. మీకు చాలా పని చేసిపెడతారటగా అని లాస్ట్ వీక్ పార్టీలో వకుళ అడిగితే, ఎదురుగా నుంచుని ముసిముసినవ్వులు నవ్వావేకానీ, ఆఫీసు పని, ఇంటిపనితో... తను నాకంటే ఎక్కువ కష్టపడుతుందని.. ఒక్క మాటయినా చెప్పావా...? పోనీ అబద్ధం చెప్పొద్దు..నిజం చెప్పడానికేం. నీ గొప్పతనం ఎక్కడ తగ్గిపోతుందోనని బాధ. శైలూకి ఇల్లు, ఆఫీసు, షాపింగ్, పార్టీలు తప్పితే ఏం పట్టవని నలుగురితో అంటావు కదా... వాటికి మించి కాన్సన్ ట్రేట్ చేసే టైం నాకుందా?" గట్టిగా అడిగింది శైలజ.

దాంతో కొంచెం నొచ్చుకున్న మురళి,

"ఈ శైలూ భలే ఎమోషనల్! ఏదో ఒకటి మాట్లాడుకోవాలి కనుక పార్టీలో రకరకాల విషయాలు చర్చకు వస్తాయి. వాటిని విని వదిలెయ్యాలి. అంతే కానీ ఇంటికి మోసుకు వస్తామా!

భర్త.. నాలుగు మాటలు మాట్లాడితే, భార్య ఓ పేరాగ్రాఫ్ మాట్లాడుతుందని అంటారు. ఆ పేరాగ్రాఫ్‌లో ఎన్ని సార్లు నా పేరు చెప్పి, మన ఫ్యామిలీ తాలూకు సంగతులు చెప్పుకుని ఉంటావు.... అలా జనాలకి రకరకాల వివరాలు తెలుస్తుంటాయి. గమనించావో లేదో మా మొగవాళ్ళలో ఈ ప్రాబ్లం ఉండదు.. అంత డీప్‌గా మేం మాట్లాడుకోం.

ఒక వేళ వకుళ నిన్ను హర్ట్ చేసే ఉద్దేశ్యంతో అలా అడిగింది అనే అనుకున్నావనుకో, మరోసారి కలిసినపుడు, మీ ఆయన బంగారం అనో, ఇత్తడనో అనేసెయ్యి.. ఓ పని అయిపోతుంది. ఇక్కడ తెలియడంలే.. మగవాడికే సొసైటీలో ప్రామినెన్స్ అని. అయినా ... ఆమె అలా అడగగానే, నీ కష్టం ఆమెకి తెలియదని, దాన్ని ఆమె గుర్తించలేదని ఎందుకు అనుకోవాలి?

పూర్వకాలంలో ఆడవాళ్ళు, మా ఆయన కొట్టాడనో, తిట్టాడనో మాట్లాడుకుని, తరువాత ఒకళ్ళనొకళ్ళు దెప్పి పొడుచుకునే వాళ్ళట. కానీ అమెరికా వచ్చే సరికి, ఎవరి భర్త ఎవరికి ఎంత తక్కువ పని చేసి పెడుతున్నాడు.... ఎన్ని డైమండ్లు కొని పెట్టాడు.. అని దెప్పి పొడుచుకోవడంలా సిల్లీగా అనిపించడంలేదూ... కొంచెం తెలివిగా బతకరా!" అని భార్య అమాయకత్వం పట్ల ప్రేమ ప్రకటించాడు మురళి.

నా వరకు ఈ చర్చ కొంచెం ఇబ్బందిగానే అనిపించింది.. కానీ ఏం చెప్పమంటారు.. ఘర్ ఘర్‌కి కహానీ! శైలజ ఇవన్నీ ఖాతరు చేసే మూడ్ లో లేదు.

"హలో... నువ్వేవో లేని పోని విషయాలకు ట్రాకు మార్చకు. నేను తెలివిగా బతుకుదామనే అడుగుతున్నాను. మంచి భర్తకి భార్యగా షాడో లోంచి బయటపడి, నా ఐడెంటిటీ ప్రతివిషయంలో నిలబెట్టుకోవడం ఎలా.. నీ మీద పొగడ్తలు వినీ వినీ బోరెత్తింది. ఫర్ ఏ ఛేంజ్.. మా అమ్మ దగ్గర నుంచి మీ అమ్మగారి వరకు, అలాగే మన స్నేహితుల చేత, నీ భార్య చాలా మంచిది.. నువ్వు చాలా అదృష్టవంతుడివి అనిపించడం ఎలాగో చెప్పు. ఒకవేళ చెప్పలేకపోయావా? మంచి భర్తల భార్యలకి కూడా కొన్ని అసౌకర్యాలుంటాయి.. రకరకాల ఏడుపులు భరించాల్సి ఉంటుంది. వాళ్ళందరూ ఏమీ ఆనందంగా ఉండరు అని ఒప్పుకో" అంది.

"ఇది ఏమన్నా ముప్పయిరోజుల కోర్సా టీచ్ చెయ్యడానికి. పైగా భేతాళుడి ప్రశ్నలా.. ఒకవేళ చెప్పలేకపోతే అని బెదిరింపులు ఏమిటి.. నిజమే ఒప్పేసుకుంటున్నాను. మంచి భర్తల భార్యలకీ కష్టాలుంటాయి.. వాళ్ళలో కూడా అందరూ ఆనందంగా ఉండలేరు." ఈజీగా ఒప్పేసుకున్నాడు.

సోక్రటీస్ అభిప్రాయంలో నాకేకాదు, శైలజకి కూడా తేడా కనిపించడం నాకు ఆనందం వేసింది.

అంత సులభంగా మీ చర్చ ముగుస్తుందనుకోలేదు. ఎంతైనా శైలజలో పాయింట్ ఉంది అని తరువాతెప్పుడో మురళితో అంటే, మంచి భర్త. ఎప్పుడూ భార్య ముచ్చట ఒప్పుకోకుండా ఉండలేనన్నాడు. ఇంతకీ ఇతను సోక్రటీస్ పార్టీయా ... మా పార్టీయా?!

✡ ✡✡

## Didn't Impress Me Much…. !

**"నా కిడ్స్ ని మాత్రం** ఇన్ని క్లాసుల్లో పెట్టను మమ్మీ, హాపీగా ఎంజాయ్ చెయ్యమని చెపుతాను....."

శైలజ ఆఫీసులో పని చేస్తోందే కానీ, తన ఆరున్నరేళ్ళ కూతురు అమృత అన్న మాటలు పదే పదే చెవుల్లో గింగిరులు తిరుగుతున్నాయి. ఏదో తెలియని బాధ....

ఇక లాభం లేదని, లంచ్ బ్రేక్‌లో మురళీ కృష్ణకి ఫోన్‌చేసి,

"బిజీగా ఉన్నావా? అర్జంటుగా నీతో మాట్లాడాలనిపించింది."

"సీరియస్ మాటర్ అయితే ఇప్పుడు చెప్పు, లేకపోతే సాయంత్రం మాట్లాడుకుందాం." అన్నాడు మురళి.

... బిజీగా ఉన్నాడేమో అని మనసులో అనుకుంటూ..

"మరీ అంత ప్రమాదకరమైన విషయమేమీ కాదనుకో, సర్లే సాయంత్రం మాట్లాడదాం..." అంది.

"నువ్వు అమ్మల్ని పికప్ చేసుకొచ్చెయ్యి, నేనెక్కడి నుంచయినా ఫుడ్ పట్టుకొస్తాను ... సారీరా ... ఇప్పుడు కొంచెం బిజీగా ఉన్నా..."

అనునయంగా చెప్పాడు మురళి.

ఆ క్షణంలో, లైఫ్ మరీ ఇంత బిజీగా తయారయిందని కొంచెం దిగులుపడ్డా, నా ఒక్కదానికే కాదుగా... మొత్తం ప్రపంచమే హడావిడిగా పరుగులు తీస్తోందని సర్ది చెప్పుకుంది.

ఐదున్నరకల్లా అమృత చదువుతున్న స్కూల్‌కి వెళ్ళింది శైలజ. ఇద్దరూ ఉద్యోగాలు చేస్తుండటంతో పాటు, తామున్న ఏరియాలో "టాప్ ర్యాంక్" పబ్లిక్ స్కూల్ లేకపోవడంతో కొంచెం దూరమయినా ప్రయివేటు స్కూల్లో చేర్చారు. అమృత ఫస్ట్ గ్రేడ్ చదువుతోంది. గల గలా మాట్లాడుతుంది. సందేహాల పుట్ట! ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రాం(ఎక్స్‌టెండెడ్ క్లాస్‌టైం)లో ఉన్న తనని పికప్ చేసుకుని ఇల్లు చేరేసరికి ఆరు గంటలు దాటిపోయింది. ఇంటి కొచ్చేలోపల ఆ రోజు తన క్లాసులో, అలాగే ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రాంలో ఏం విశేషాలున్నాయో కనుక్కుని, మధ్య మధ్యలో గుడ్ జాబ్ అనో, వండర్‌ఫుల్ అనో రకరకాలుగా మెచ్చుకుంటూ...ఓపిక, ఉత్సాహం ఉన్నా లేకున్నా... విద్య వినోదం రంగరించిన ముచ్చట్లు చెపుతూ .. ఇంటికి చేరే సరికి, లివింగ్ రూంలో ... మురళి ఎదురుగా కనిపించగానే తల్లీ కూతుళ్ళ ముఖాలు విచ్చుకుని తామర పూవులంత అయ్యాయి.

హమ్మయ్య! ఇక కూతురి వంతు నీది అన్నట్టు... ఓ ఫీలింగ్ ఇచ్చేసి, వాళ్ళిద్దరినీ ఒక టీంని చేసి, బ్రేక్ తీసుకుంది శైలజ.

"ఏదో మాట్లాడాలన్నావ్"

ఆరా తీశాడు మురళి.

"ఇంత సేపు ఆగాను కదా, అమృత పడుకున్న తరువాత తీరిగ్గా మాట్లాడదాం"

చెప్పింది.

తరువాత రకరకాల పనులు... ఫ్యామిలీ టైం!

శైలజ కిచెన్ సర్దుతుండగా, కథలు చదువుతూ కూతుర్ని పడుకో పెట్టి వొచ్చాడు మురళి. ఇప్పుడు చెప్పమనగానే...,

"పొద్దున స్కూల్‌కి తీసుకెళ్ళేప్పుడు, ఈ వీకెండ్ తెలుగు క్లాసులో పరీక్ష ఉంది అని గుర్తు చేశాను. వెంటనే, నేను పెద్దయినప్పుడు, నా కిడ్స్‌ని మాత్రం ఇన్ని క్లాసుల్లో పెట్టను మమ్మీ , హాపీగా ఎంజాయ్ చెయ్యమని చెపుతాను..... అంది. ఒక్క క్షణం ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. తరువాత, చిన్నపిల్ల ...తనకేం తెలుసు... అనిపించింది. మళ్ళీ అంతలోనే, మన సరదాలు, కోరికలన్నీ తన నెత్తి మీద రుద్ది ప్రెజర్ పెడుతున్నామా ... బహుశా యాక్టివిటీస్ వల్ల అలసి పోతోందేమోనని జాలేసింది. రేప్పొద్దున పెద్దయ్యాక మీ ఇష్టాలన్నీ నా నెత్తిన రుద్ది, హేపీ చైల్డ్ హుడ్ లేకుండా చేసారంటే ... తట్టుకోవడం కష్టమే!. ఇక్కడ పెరిగే పిల్లలు కన్‌ఫ్యూజ్‌డ్‌గా ఉండటంతో పాటు, ఎదిగే కొద్దీ ఇంట్లో ఒక మనిషి, బయట మరో మనిషి లాగా ఉంటారని రాసిన ఆర్టికల్స్ చదివినప్పుడల్లా భయం వేస్తుంటుంది."

అంటూ ఆందోళనగా, అతని ప్రతిస్పందన కోసం చూసింది.

"శైలూ, చిన్నప్పుడు మనం ఎంసెట్లనీ, కోచింగ్‌లనీ, ప్రైవేట్ క్లాసులనీ ఎన్ని తిరగలేదు!? ఇండియాలో పిల్లలకి కనీస సరదా సినిమా. అది కూడా చూడటానికి వీల్లేనంతగా పడి పడి చదివిన రోజులు లేవా? బాల్యం లేకుండా చేశారని మన పేరెంట్స్‌ని మనం బ్లేమ్

చేస్తున్నామా? వాళ్ళా పునాది వెయ్యకపోతే, కష్టపడటం రాకపోతే అమెరికాలో, ఈ స్థితిలో ఉండేవాళ్ళమా? ప్రస్తుతం ఇండియాలో చదువుతున్న కిడ్స్‌తో పోలిస్తే వీళ్ళకి ఎన్ని సౌకర్యాలు ! రిక్రియేషన్లు !! నువ్వు ప్రతి విషయాన్ని సెన్సిటివ్‌గా తీసుకుంటావు. ఇక ఇక్కడ పెరగటం వల్ల వొచ్చే ప్రవర్తన అంటావా!? సాధ్యమయినంత వరకు మన విలువలు, అనుబంధాలు, అస్తిత్వం కూడా తనవిగా స్వీకరించేట్టు ప్రయత్నం చేస్తున్నాం. అందుకే కదా ఈ కల్చరల్ యాక్టివిటీస్ అన్నీ. నేనయితే అవి మన కోరికలు అనను. తన మూలాలని పరిచయం చెయ్యడం, వాటితో తన అనుసంధానం కొనసాగేలా చూడటం అంటాను."

తేలికగా తీసుకునే ప్రయత్నం చేశాడు మురళి.

పొద్దుటి నుంచీ సాయంత్రం దాకా స్కూల్‌లో ఉండి, మళ్ళీ వీకెండ్‌లో క్లాసులంటే తన వయస్సుకి కష్టమే! మన రోజుల్లో, మరీ ఫస్ట్ గ్రేడ్‌లోనే ఇంత బిజీ కాదు మనం. ఆ మాత్రం తెలివి నాకు లేదనుకోకు అంటూ చిన్నబుచ్చుకుంది శైలజ.

అమ్మనాన్న ఏ క్లాసులో పెట్టినా, అది తన భవిష్యత్తును దృష్టిలో పెట్టుకునేనని, తన మంచి కోసమేనని, అలాగే వయస్సులో పెద్ద వాళ్ళవడం చేత తన కంటే అమ్మనాన్నలకే వీటి గురించిన నాలెడ్జి ఎక్కువనే లాంటి కోణాలెన్నో... ఆరేళ్ళ పిల్లకి అర్థమయ్యేట్టు చెప్పే ప్రయత్నం ఆల్‌రెడీ చేసి చూసింది. అంతా విన్న అమృత...

"నేను స్కూల్లో బ్యాలే డాన్స్ నేర్చుకుంటానంటే, కూచిపూడిలో పెట్టావు. డాన్స్ డ్రస్‌తో ఉన్న ఫొటోలు నా స్కూల్ ఫ్రెండ్స్ ఇద్దరికి చూపిస్తే ...దె గేవ్ మి ఎ ఫన్నీ లుక్! నేను ఎంతో కష్టపడి నేర్చుకుంటున్నానని చెప్పినా వాళ్ళకి అర్థం కాదు. నాకేమో వాళ్ళందరితో కలిసి బ్యాలే చెయ్యాలనుంది. కానీ వాళ్ళతో ప్రాక్టీస్ చెయ్యడానికి టైం లేదు. ఇదొక్క విషయమే కాదు...చాలా వాటిల్లో .. ఐ ఫీల్ డిఫరెంట్. పైగా పిల్లలు ఏమనుకుంటున్నారో పేరెంట్స్ అడగకపోతే, పేరెంట్స్‌కి పిల్లలు తెలియరని మా టీచర్ చెప్పింది. బోలెడన్ని క్లాసులలో పెట్టడమే కాకుండా... ఎదైనా టెస్ట్ బాగా చెయ్యకపోతే నువ్వు, డాడీ కంగారు పడిపోతారు...ఇట్స్ నాట్ ఎ బిగ్ థింగ్ మమ్మీ ... ఈవెన్ మై టీచర్ సెడ్ ఇట్!"

అనటమే కాకుండా, పెద్ద ఆరిందలా మీకు అర్థం కాని విషయాలు చాలా ఉన్నాయనే భావం స్వరంలో ఒలికించడం.. బాడీ లాంగ్వేజ్ ... రేర్‌వ్యూ మిర్రర్ లోంచి చూసిన శైలజకి, నిజం చెప్పాలంటే కష్టమేసింది. స్కూల్‌లో చేరిన ఆర్నెల్లకే మీరు "బోరింగ్" పేరెంట్స్‌ని తన కొడుకు అన్నాడని స్నేహితురాలు సుగుణ చెప్పడం గుర్తొచ్చింది. ఇలాంటి భావాలు మొగ్గలో ఉన్నప్పుడే తుంచకపోతే పాతుకు పోతాయనే ఆందోళనా కలిగింది.

"యు నో వాట్! చిన్నగా ఉన్నప్పుడు నేను డాడీ కూడా మా పేరెంట్స్‌కి పదే పదే చదువుకోమని చెప్పడం, ఆందోళన పడటం తప్ప పెద్దగా తెలియదని, సరదాగా ఆడుకుంటుంటే చదువు పాడయిపోతుందనే రూల్స్ పెట్టడం అధికారాన్ని చలాయించడమేనని అనుకునేవాళ్ళం. కానీ పెద్దయిన తరువాత వాటి విలువ ఏమిటో తెలిసి వొచ్చింది. అందుకే ఇప్పుడు కంప్లయింట్ చెయ్యం. కొంచెం కష్టంగానే ఉంటుంది కానీ, తెలుగు, కూచిపూడి నాట్యం, సంగీతం అలాగే మన సంస్కృతి నేర్చుకోవడంలో ఉన్న విలువ పెద్దయిన తరువాత అర్థం అవుతుంది. మీ క్లాసులో ఉన్న ఫ్రెండ్స్‌కి నీ డాన్స్, నువ్వు నేర్చుకునే భాష, నీ ఫుడ్ చిత్రంగా అనిపిస్తే, నువ్వు బాధపడకుండా, దాని గురించి వివరంగా చెప్పాలి. ఇటాలియన్, చైనీస్, స్పానిష్ లాంటి భాషలు నేర్చుకునే ఫ్రెండ్స్ నీ క్లాస్‌లో ఉండే వుంటారు వెతుకు. సో .. యు ఆర్ నాట్ డిఫరెంట్! సరే... నా కిష్టమైన తెలుగు క్లాసులోనే పెట్టాను. అలాగే నువ్వు అడిగిన స్విమ్మింగ్ లో కూడా చేర్పాను కదా!"

ఈ మాటలు చెప్పి, తన వాదనని చాలా బాగా కూతురికి వినిపించానని అభినందించుకుంది శైలజ.

"నో మమ్మీ.... ఐ ఫీల్ డిఫరెంట్! కొంతమంది ఫ్రెండ్స్ వేరే లాంగ్వేజ్ నేర్చుకుంటారు. కానీ మనలాగా క్రిస్టమస్, వినాయక చవితి ..ఇంకా మిగతా పండగలు చెయ్యరు. ఇండియాలో చాలా లాంగ్వేజ్‌లున్నాయని చెప్పావు. నేను ఒకటి నేర్చుకోవడం వల్ల మిగతా

అందరితో మాట్లాడలేను కదా! పైగా ఇండియాలో చాలా మందికి ఇంగ్లీషు వొచ్చన్నావు.. మరి నాకు ఈ భాష వల్ల ఉపయోగం ఏమిటి? మా పేరెంట్స్ ఇండియన్స్ అనాలా? తెలుగు వాళ్ళు అని చెప్పాలా ? రెలిజియన్ గురించి కూడా నా క్లాస్ మేట్స్ చాలా ప్రశ్నలు వేస్తుంటారు. వాళ్ళడిగే వాటికి ఆన్సర్ చెయ్యాలనిపించదు. ఐ జస్ట్ వాంట్ టు బి వన్ అమాంగ్ దెం!"

ఇలా తేల్చేసి, స్కూల్ రావడంతో కారు దిగి వెళ్ళిపోయింది.

ఈ వివరాలన్నీ విన్న మురళి,

"మీ మధ్య ఇంత డిస్కషన్ నడిచి ఉంటుందని నేను ఊహించలేదు శైలూ. యాక్టివిటీస్ విషయంలో అంత పర్సెంట్ రావాలి ..ఇంత రావాలని ప్రెజర్ పెట్టకుండా సరదాగా క్లాసులకి వెళ్ళి రమ్మంటే సరిపోతుందేమో. మనం మన పెద్ద వాళ్ళు చేసినట్టు, లేదా చెప్పినట్టు కొంచెం కఠినంగా ఉంటే తప్పు, పిల్లలు మాట వినరనుకుంటే పొరపాటే. ముఖ్యంగా మన భాష, సంస్కృతి నేర్పించడంలో ఉత్సాహపూరిత వాతావరణాన్ని కల్పించక తప్పదు. లేదంటే అసలుకే మోసం వొచ్చే ప్రమాదం కనిపిస్తోంది. ఈ సారి నుంచి అమ్మలుకి సంబంధించిన ఏ పని చేసినా తనతో మాట్లాడదాం. మన కళ్ళకి పసి పిల్లలాగా అగుపిస్తుంది కానీ, స్కూల్లో చేరి రెండేళ్ళు నిండబోతోంది. తన ఫ్రెండ్స్ అందరూ ఎలాంటి కబుర్లు చెప్పుకుంటున్నారు, ఎక్కడ తను ఇబ్బందిగానో, అర్థం కానట్టు...ఫీలవుతోందో తెలిసుకుని, కనెక్ట్ కావాల్సిన అవసరం మనకే ఎక్కువ ఉంది" చెప్పాడు .

"అంతేనా! వాళ్ళు తమ పిల్లల్ని ఆ ప్రోగ్రాంలో చేర్చారు. వీళ్ళు ఇక్కడ చేర్చారు. ఇవన్నీ విని మన బుర్రలు కూడా పాడు చేసుకోకూడదని పిస్తోంది. ఇప్పటికే, ఆంధ్రా నుంచి అమెరికాకి చదువుల 'పందేల'ని దిగుమతి చేసుకున్న ఫీలింగ్. ఎంతయినా మన బ్యాక్‌గ్రౌండ్ అలాంటిది. ఎక్కడికి పోతుందా యావర్తి. పొద్దున తన మాటలు విన్న తరువాత నేను చాలా ఆలోచించాను. అమృత ఇంద్ర ధనుస్సు ఎక్కి ఉయ్యాల ఊగాలనుంది అంటే, ఆ రంగులెన్ని ఉన్నాయో లెక్కపెట్టు, అవి ఎక్కడి నుంచి వొచ్చాయో కనిపెట్టమని పురమాయించినట్టుగా అనిపించింది మన తంతు. ఇక పిల్లల మీద మనకుండే అంచనాలంటావా!? సిన్సియర్‌గా ఆలోచిస్తే దారుణంగా తోస్తోంది. మనమీద మనకి అంచనాలుండటం సమంజసం కానీ, కన్నందుకు వాళ్ళ మీద వాటిని పెట్టి స్వారీ చెయ్యడం. పిల్లల్ని సరిగా ట్రీట్ చెయ్యకపోవడమే!"

ఒప్పుకుంది శైలజ.

కానీ అంతలోనే, గోడకి కొట్టిన బంతిలా ఇద్దరూ కనీసం సగం వెనక్కొచ్చారు ... అలా అని "పూర్తిగా" ఒదిలెయ్యలేం .....పిల్ల భవిష్యత్తుని గైడ్ చెయ్యాల్సిన బాధ్యత మనదే కదా ..అంటూ కూడబలుక్కునారు!

కడుపు తీపి మరి !

అమృత చిన్న పిల్ల కాబట్టి సరిపోయింది. అదే ఏ టీనేజరో అయితే గట్టిగా అరిచి చెప్పేది .... మీ ధోరణి .... didn't impress me much అని !

✡ ✡✡

# రియల్-మాయ

"**ఇండియా నుంచి** మా హరి మావయ్య ఫోన్ చేశాడు. అమెరికాలో డబ్బు ఇన్వెస్ట్ చేద్దామనుకుంటున్నాట్ట. వీలున్నప్పుడు నువ్వు ఒకసారి ఫోన్ చేసి మాట్లాడు. " అభ్యర్థనగా అడిగింది శైలజ.

"అదేంటి! మీ మామయకి అలాంటి ఆలోచనలు ఉన్నట్టు ఇదివరకెప్పుడూ చెప్పలేదే. పోనీ ఆయనేమన్నా సాఫ్ట్‌వేర్ కంపెనీ ఓనరా ఇక్కడో బ్రాంచి పెట్టడానికి? ఇండియాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే ఆయన ఇక్కడే ఫీల్డ్‌లో డబ్బులు పెడతారు? కొంపదీసి షేరు మార్కెట్లో ఏమైనా పెడతారా ఏంటి? మనం పెట్టిన డబ్బులే మార్కెట్లో ఇరుక్కుపోయాయి. బ్రేక్ ఈవెన్ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్నాను." వాపోయాడు మురళీ కృష్ణ.

"మా మావయ్యది గొప్ప బిజినెస్ బ్రెయిన్! అవకాశాన్ని అందిపుచ్చుకోవాలనటమే కాదు, అవసరమైతే దాన్ని క్రియేట్ చేసుకోవాలంటాడు. ఇండియాలోనే రియల్ ఎస్టేట్ వ్యాపారం చెయ్యాలా? అదే పని అమెరికాలో ఎందుకు చెయ్యకూడదు? అనే ఆలోచన ఈ మధ్య కలిగిందట. అందుకు నువ్వేమైనా కో ఆపరేట్ చేస్తావేమోననేది ఆయన ఆశ. అయినా... మావయ్య ఏం చెపుతాడో వినకుండానే ఇక్కడేం ఇన్వెస్ట్ చేస్తారంటావేంటి?" విసుక్కుంది శైలజ.

శైలజ మావయ్య ఏమనుకుంటున్నారో ముందే తెలిస్తే, సరైన సలహాలు ఇవ్వొచ్చనేది మురళి ఆలోచన. అమెరికా నుంచి ఇండియాలో పెట్టుబడులు పెడితే సహజంగానే ఉంటుంది కానీ, సాఫ్ట్‌వేర్, మరేదైనా టెక్నాలజీకి చెందని వాళ్ళు ఇండియా నుంచి ఇక్కడ పెట్టుబడి పెడతానంటే కొంచెం విచిత్రంగానే తీసుకున్నాడతను. ఇంత ఖాళీ స్థలం ఆంధ్రప్రదేశ్లో ఉంటే, మన వాళ్ళు ఎన్ని ప్లాట్లు వేసి అమ్మేవాళ్ళో అని క్రితం సారి వచ్చినప్పుడు వాళ్ళ నాన్న అనటం, ప్రపంచంలో ఎక్కడ ఖాళీ స్థలం చూసినా మనవాళ్ళకి ఇలాంటి ఆలోచనలే వస్తాయని అందరూ నవ్వుకోవడం కూడా గుర్తొచ్చింది.

"..అయినా అమెరికాలో భూముల మీద పడిందేమిటి మీ మామయ్య కన్ను. ఆంధ్రప్రదేశ్‌లో భూములు ఇంకేం మిగలకుండా రియల్ ఎస్టేట్ కంపెనీలు పంచుకున్నాయా? ఇద్దరం అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్నా ఆయన డబ్బుతో పోటీ పడలేకపోతున్నాం. ఏమైనా మీ మామయ్య ఇంట్రెస్టింగ్ పర్సన్. ఆయన్ని చూసి నేర్చుకోవాల్సిందే" అంటూ రకరకాల జోకులేసి, "ఇక్కడి పరిస్థితులు, మార్కెట్ నీకు తెలియనవి కాదుకదా... నీ అభిప్రాయం చెప్పుండాల్సిం"దన్నాడు.

ఆ మాత్రం ప్రయత్నం శైలజ ఆల్రెడీ చేసింది... పైగా తనకు తెలిసిన పాండిత్యం అంతా ప్రదర్శించి తనవాళ్ళ దగ్గరనుంచి మార్కులు కొట్టేయ్యాలనేది ఆమెకున్న ఆరాటం కూడాను. అంతవరకు బాగానే ఉంది కానీ, శంఖంలో పోస్తే కానీ తీర్థం కాదన్నట్టు, తనెన్ని చెప్పినా అబ్బాయితో కూడా ఓసారి మాట్లాడితే ఇంకాస్త క్లారిటీ వస్తుందనో, ధైర్యంగా ఉంటుందనో పాడిందే పాటలాగా అందరి దగ్గర నుంచీ వినీ వినీ, తన తరుపు బంధువులు ఎవరైనా సలహానో, సహాయమో అడగగానే, మురళి ఇంట్లో ఉన్నప్పుడు ఫోను చేయిస్తా అని చెప్పడానికి చాలా వరకు డిసైడ్ అవుతుంది శైలజ

నిజానికి వాళ్ళ హరి మావయ్య అమెరికాలో రియల్ వ్యాపారం మొదలుపెడతాను అనగానే, ఆయనేం చెపుతున్నాడో, తనేం వింటోందో కొంచెం సేపు అర్థం కాలేదు శైలజకి. అందుకు ప్రేరేపించిన కారణాలు వినేసరికి, ఇంకా ఆశ్చర్యమేసింది. అమెరికా ఆర్థిక పరిస్థితి అంతగా బాగుండకపోవడం, రియల్ ఎస్టేట్ మార్కెట్ పడిపోవడంలాంటి అనేక కారణాలగురించి ఇండియాలోని పత్రికలు ముఖ్యంగా తెలుగు పత్రికలు, ఛానళ్ళు ఊదరగొట్టేయడంతోపాటు, కేవలం ఐదారువేల డాలర్లు పెడితే బ్రహ్మాండమైన ఇల్లు కొనడానికి దొరుకుతోందనే వార్తలు కంటపడ్డ తరువాత, కొంత లేటయినా, ప్రస్తుతం హరి మావయ్య బిజినెస్ బ్రెయిన్ చురుగ్గా ఆలోచించడం

మొదలుపెట్టిందట! పైగా, ఇప్పటిదాకా పెట్టుబడులు పెట్టిన హైదరాబాదులోనేమో ఆంధ్రా - తెలంగాణా గొడవలు... చూస్తుంటే అదో అంతులేని వ్యవహారంగానే ఉంది.

"అదృష్టం కొద్దీ, పరిస్థితులు బాగుండగానే పెట్టుబడి పెట్టిన భూములు, ఇళ్ళు అమ్మేయబట్టి, ఇవాళ ఇలా నాలుగు రాళ్ళు వెనకేయగలిగాను. మళ్ళీ ఇక్కడే ఇన్వెస్ట్ చేద్దామంటే, పొలిటికల్‌గా బాలేదు. అందుకని అమెరికాలో అయితే, నా అదృష్టం బాగుంటే, డాలర్లలో సంపాదించొచ్చు కదా అనుకుంటున్నాను. నా దగ్గర ఉన్న డబ్బులో కొంత, సుమారు ఓ ఇరవై, ముప్పయి లక్షలు పంపిస్తాను. నాలుగైదు ఇళ్ళు కొని, అద్దెలకి ఇచ్చెయ్యండి. ఎల్లకాలం మార్కెట్ ఇలాగే ఉండదు కదా, రేట్లు బాగా పెరగ్గానే అమ్మేద్దాం. ఏ విషయం మీ ఆయన్ని కనుక్కుని చెప్పు అమ్మలూ.." అని సింపుల్‌గా తేల్చేశాడాయన!

హరి మావయ్య అన్న మాటల్ని, అచ్చంగా అలాగే.... ఐ మీన్... ఆయన మాటల్లోనే మురళీ కృష్ణకి వినిపించేసరికి, "అంటే కాలిఫోర్నియాలో... అందునా బే ఏరియాలో ఐదు లక్షల చొప్పున ఒక్కో ఇల్లూ అప్పనంగా కొనేద్దామనే! ఎంత ఆశ! వ్యవహారం అంత ఈజీ అయితే, ఇక్కడున్న ఆంధ్రా వాళ్ళంతా తలా ఓ డజను కొనుక్కునే వాళ్ళుగా. ఆ మాట అడగపోయావా? అయినా.. పాపం ఆయన మాత్రం ఏం చేస్తార్లే, అక్కడి మీడియా అట్లా ఏడుస్తోంది." కోపం తెచ్చుకున్నాడు మురళి.

ఓ వైపు తాము కొన్న ఇంటికి వాల్యూ తగ్గి, వేలకి వేలు మార్ట్‌గేజ్ ఇంట్రస్ట్ కడుతూ దేవుడా.... రాముడా ఇంకెన్నాళ్ళిలా అని ఎదురు చూస్తుంటే, పది పైసలకి, పావలాకి ఇళ్ళమ్ముతున్న తీరుగా పేపరు వాళ్ళు రాశారనగానే, శైలజకి చాంతాడంత కోపం వచ్చింది. ఎక్కడో మారుమూల ప్రాంతాల్లో అలా జరిగి ఉంటుంది. మా దగ్గర కాదు. కనీసం హాఫ్ మిలియన్ పెడితే కానీ ఓ మంచి అపార్ట్‌మెంట్ లాంటిది కూడా కొనుక్కోలేం మావయ్యా... అని చెప్పాలని ప్రయత్నించింది కానీ.... ఆ పాయింటు ఆయన మెదడులో రిజిస్టర్ అయినట్టు అనిపించలేదు. లేదా ఆయన ధోరణి ఇటువైపు లేదు అనుకోవాలి. దాంతో ఇక లాభం లేదనుకుని, మురళికి అంటగట్టేసింది.

ఇదంతా విన్న మురళి,

"సరే! ఇక మాట్లాడక తప్పదంటావు" అని భారంగా నిట్టూర్చి, ఆలోచనలో పడ్డాడు. ఒకవేళ అలాటి ఇన్వెస్ట్‌మెంట్ లేవో ఇక్కడ పెట్టొద్దు అని చెప్పామా, మాకు సాయం చేయడం ఇష్టం లేకనో, మేం బిజినెస్ చేసి బాగుపడటం గిట్టకో అలా చెపుతున్నాడని అనుకుంటారు. ప్రాక్టికల్‌గా చెప్పాలంటే, విదేశాల్లో జీవితాలు ఊహలకీ, రాతలకీ కొంత భిన్నంగానే ఉంటాయి. మీ ఆస్తులు మానేజ్ చేసే టైం మాకు లేదు అని చెపుదామంటే బడాయిలు పోతున్నాడంటారేమోనని జంకు. అలాగని, ఇప్పటిదాకా ఉన్న మంచి పేరు పోగొట్టుకోకూడదు. ఏది ఏమయినా ఎవాయిడ్ చెయ్యడం కుదరదు కాబట్టి, ఫోన్ చెయ్యక తప్పింది కాదు.

కుశల ప్రశ్నలన్నీ అయ్యాక, టాపిక్ లోకి వచ్చేసిన మురళి, ఐడియా బ్రహ్మాండంగా ఉంది కానీ.... అమెరికాలో ఉండి రియల్ ఎస్టేట్ బిజినెస్ చేస్తే కానీ, ఒకదేశంలో ఉండి మరో దేశంలో చెయ్యడం అంత లాభదాయకం, సౌకర్యం కాదని, ప్రస్తుతం అమెరికాలో ఉన్న మార్కెట్‌ని బట్టి చూస్తే, మారుమూల ప్రాంతంలో అంత తక్కువ ధరకి ఒకవేళ ఏదైనా ఇల్లు కొన్నా, దాని వాల్యూ పెరగటానికి, అంతో ఇంతో లాభం రావడానికి కనీసం నాలుగైదు సంవత్సరాలు పట్టక తప్పదని, ఆ మాటకూడా స్థిరంగా చెప్పలేనని చెప్పడమే కాకుండా ఆస్తులు అమ్మినప్పుడు ఇండియాలోలా బ్లాక్ అండ్ వైట్ వ్యవహారం నడవదు కాబట్టి టాక్సులు కూడా బాగానే కట్టాల్సి వస్తుందని రకరకాల కోణాల్లో చెప్పిచూశాడు. అన్నీ విన్న శైలజ మావయ్య, చాలా తేలికగా తీసుకుని,

"మార్కెట్ మరీ అంత డల్ అయితే కష్టంలే బాబూ.. మన ఇండియాలో వేరే స్టేట్లో కొని వ్యాపారం చెయ్యొచ్చు. ఇవ్వాళ రేపు. తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర ఎక్కడ చూసినా ఈ బిజినెస్లో మనవాళ్ళే! అంత ఎగ్రెసివ్‌గా సంపాదిస్తేనే వెనకేయగలుగుతాం. నీ మాటల్ని వింటుంటే నాకో సలహా ఇవ్వాలనిపిస్తోంది. నువ్వు కూడా డబ్బులు అమెరికాలో పెట్టకు. నిజానికి హైదరాబాదులో ఇల్లు కొనడానికి ఇదే సరైన సమయం. సంవత్సరం క్రితం రెండుమూడు కోట్లు పలికిన ఇళ్ళు ఇప్పుడు కోటి రూపాయల లోపల వచ్చేస్తున్నాయి.

ఒకటి కొని పెట్టుకున్నావనుకో ఎంత.. మళ్ళీ సంవత్సరం తిరిగే సరిగి ధరలు పెరిగిపోవూ! హైదరాబాదులో ప్రస్తుతం పొలిటికల్‌గా బాగాలేకపోయినా, ఒకసారి సర్దుకుందంటే, మళ్ళీ మార్కెట్ పుంజుకుంటుంది. ఇక్కడ జనం ఎక్కువ. జాగా తక్కువ కాబట్టి నష్టం అనే ప్రశ్నేలేదు.." అని ఓ అరగంటసేపు గుక్కతిప్పుకోకుండా విశ్లేషించడమే కాకుండా అరచేతిలో వైకుంఠం చూపించేశాడు.

అంతే! మురళీ కృష్ణలోని ఆశాజ్యోతి మళ్ళీ ఓ వెలుగు వెలిగింది. స్తబ్దుగా ఉన్న తన ఆలోచనలకి కొంత ఇంధనం లభించినట్టు రెండేళ్ళలో పెట్టుబడి డబుల్ చేసుకోవచ్చు అనే ఈస్ట్‌మన్ కలర్ చిత్రం కళ్ళముందు రెపరెపలాడింది. ఇదేదో మంచి సలహాలాగా ఉంది. పైగా పెద్దాయన, ఆ ఫీల్డ్‌లో బిజినెస్ చేసి బాగా డబ్బులు సంపాదించినతను చెపుతున్నాడంటే, అది ఎక్స్‌పర్ట్ ఒపీనియన్‌లాంటిదే అని బలంగా అనిపించింది.

తన నిర్ణయం త్వరలోనే తెలియచేస్తానని, ఏదైనా మంచి ప్రాపర్టీ ఉంటే వెతకమని, హరిమావయ్యకి చెప్పి ఫోన్ పెట్టేసిన తరువాత, సారాంశాన్ని శైలజకి తెలియజేయగానే, ఆమె ఒక చూపు చూసింది. ఇప్పుడు కడుతున్న పేమెంట్ల సంగతి ఏమిటంది. కొంపతీసి మావయ్య మనమీదే ఆయన మార్కెటింగ్ టెక్నిక్స్ ప్రయోగించాడేమో ఆలోచించమంది. అది ఆయన ప్రాపర్టీయే అయివుంటుంది అని అనుమానించింది.. ఎందుకంత రిస్కు తీసుకోవాలంది. కానీ మురళికి అందులో లాజిక్ కనిపించింది. హరి మావయ్య గొప్ప ఉదాహరణ అన్నాడు... ఆయన తెలివిని మెచ్చుకున్నాడు. విషయం శైలజని దాటి హైదరాబాదు పరుగులు తీసింది! మరి మార్కెట్టో!?

✡ ✡✡

## ఫర్ ఎ ఛేంజ్!

**ఎందుకోగానీ, జీవితం** పరమ రొటీన్ గా తయారయిందనే ఫీలింగ్ ఇవ్వాళా రేపు శైలజలో ఎక్కువగా కలుగుతోంది. ఏదైనా ఛేంజ్ ఉంటే బాగుండుననిపిస్తోందని ఓ రోజు మురళీకృష్ణతో అంది.

"చేంజ్.. అంటున్నావు. కొంపతీసి ఒబామా గానీ పూనుతున్నాడా ఏమిటి? ఎన్నికల ముందు ఛేంజ్... ఛేంజ్ అని ఊరించాడు. ఎన్నికల తరువాత బుష్ పోయి నేను ప్రెసిడెంట్ కావడాన్ని మించిన ఛేంజ్ ఇంకేముంది అన్నట్టుంది అతని ధోరణి. ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే ఉన్నట్టుండి ఒక్క పెట్టున మార్పులు వచ్చెయ్యవు.. అసలు విషయం అంతా మన మనసుని ట్యూన్ చేసుకోవడంలో ఉంది" అని నింపాదిగా ఓ స్టేట్ మెంట్‌ని పడేసిన మురళీ కృష్ణని చూస్తే చిర్రెత్తుకొచ్చింది శైలజకి.

"చూడు.. నీ సూక్తి ముక్తావళీ నాకు అవసరంలేదు. ఈ రొటీన్ జీవితంలోంచి కాస్తంత ఊపిరి పోసుకోవాలని, కాలాన్ని ఖాతరు చేయకుండా మంచి అనుభవాల్ని, అనుభూతులని పోగుచేసుకోవాలని, ఇంకిపోతున్నట్టనిపిస్తున్న ఉత్సాహాన్ని రీ చార్జ్ చేసుకోవాలనేది నా ఫీలింగ్. నా మనసుని, మాటల భావాన్ని అర్థం చేసుకోకుండా.. ఒబామా అతని పెర్ఫార్మెన్స్.. ట్యూన్ చేసుకోవడం అంటూ తలా తోకా లేకుండా మాట్లాడతావేంటి"ని శైలజ విసుక్కుంది.

నిజానికి, ఏదో తేలికగా మాటర్ తేల్చేద్దామనే ప్రయత్నంలో తోచినదేదో అనేశాడు మురళి.

కానీ. శైలజ రియాక్షన్ చూసిన తరువాత "పోనీ ఓ వారం శలవుపెట్టి ఏదైనా ట్రిప్ వెళదామా? ఎలాగో సమ్మర్ (అమెరికన్) కూడా వచ్చేస్తోంది. ట్రిప్ నుంచి వచ్చిన తరువాత నువ్వన్నట్టు కొంత రీ చార్జ్ అయినట్టు అనిపిస్తుందేమో.. అయినా తిరిగొచ్చిన తరువాత మళ్ళీ లైఫ్ మామూలే కదా... అందుకే పరిస్థితులకు అనుగుణంగా ట్యూన్ చేసుకోవాలన్నా"నని వివరణ ఇచ్చుకున్నాడు.

అతని వివరణతో శైలజ అంతో ఇంతో ఉపశమనం పొందిన మాట వాస్తవమే అయినప్పటికీ "లైఫ్ లో పెద్ద మార్పేమీ ఉండదు" అనే వాక్యం మాత్రం నచ్చలేదు.. ఒప్పుకునేట్టుగా లేదు.

"ఇందాక నువ్వు మనసుని ట్యూన్ చేసుకోవాలన్నావు చూశావా.. అలాగే మనసు పెట్టి మార్పు కోసం వెతికితే ... మన జీవితాన్ని మనమే ఇంకా ఆహ్లాదంగా మార్చుకోవచ్చు. ఏదో కాలం వెళ్ళిపోతోంది లెమ్మని సోమరిగా సరిపెట్టుకోకుండా.. జీవితాన్ని మరింత ఆనందమయం చేసుకోవడం ఎలాగో ఆలోచించు.. థింక్ "అవుట్ ఆగ్ ద బాక్స్"! అంటూ మెదడుకి కొంచెం మేత పెట్టాలని చూసింది.

మురళికి ఇదంతా ఓ పెద్ద టైమ్ వేస్ట్ వ్యవహారం అనే గాఢాభిప్రాయం ఏ మూలో ఆల్రెడీ ఉంది. అందుకే, "నువ్వు ఇలా మాట్లాడుతుంటే, మా కొలీగ్ రాబర్ట్ గుర్తొస్తున్నాడు. పెళ్ళి చేసుకునేప్పుడు తను అనుకున్నట్టుగా అన్నీ జరగలేదట.. అందుకని మళ్ళీ మొదటినుంచీ చేసుకోవాలనుంది అంటాడు. అలాగే పెళ్ళినాటి ప్రమాణాలు (Marriage oath's) రివైవ్ చేసుకుంటేనే కానీ సరిగా నిద్రపట్టేట్టూ లేదంటాడు... అయిపోయిన పెళ్ళికి మళ్ళీ బాజాలెందుకని వాణ్ణి నేను టీజ్ చేస్తుంటాను." అని చెప్పి "అతిగా ఆలోచించడం మానేస్తే ఆటోమేటిక్ గా కొన్ని రోజులకి ఈ ఫీలింగ్ సెట్ అయిపోతుంద"ని తేల్చాడు.

మరో వైపు శైలజేమో మురళి వాదనతో బొత్తిగా ఏకీభవించలేకపోతోంది. అందుకు కారణం ఈ మధ్య ఆమెకు తారస పడిన రెండు సంఘటనలు.

అందులో మొదటిది. తన క్లాస్‌మేట్ వసంత విషయం. తనకి పెళ్ళయి నాలుగేళ్ళయింది. భర్త రమేష్‌తో కలిసి బే ఏరియాలోనే ఉండటంతో తరచూ రెండు కుటుంబాలు కలుస్తుంటాయి. ఓ నెల రోజుల క్రితం వసంత ఓ షాకింగ్ న్యూస్ చెప్పింది. అదేమిటంటే తను, రమేష్ విడివిడిగా ఉండాలని నిర్ణయించుకున్నారని. పైగా స్వయంగా రమేష్ అపార్ట్ మెంట్ వెతికి వసంతకి అన్ని ఏర్పాట్లు చెయడం విచిత్రంగా అనిపించింది శైలజకి. ఇదే మాట వసంతతో అన్నప్పుడు.

"ఒక సంవత్సరంగా ఇద్దరం విపరీతంగా పోట్లాడుకుంటున్నాం. చీటికి మాటికి కోపాలు వస్తున్నాయి. ఇలాగే కొనసాగితే మా మీద మాకే చిరాకేసేలా ఈ రిలేషన్‌షిప్ తయారవుతుంది అనిపించింది. కొంతకాలం విడిగా ఉంటే, సెట్ అవుతుందేమోనన్న నా ఆలోచనకి రమేష్ కూడా సరేనన్నాడు. చూసే వాళ్ళకి విచిత్రంగా అనిపించొచ్చు కానీ. వియ్ ఆర్ గెటింగ్ బెటర్! నిజానికి ఇలాంటిదేదో నిర్ణయం తీసుకుంటానని కలలో కూడా అనుకోలేదు" అంది.

వసంత మాటలు విన్న శైలజకి, తమ రిలేషన్‌షిప్ వర్కవుట్ అవడం కోసం శ్రద్ధ, చేస్తున్న ప్రయత్నం భలే ముచ్చటేసింది. నలుగురూ నాలుగు అనుకుంటారని అనుకోకుండా సిన్సియర్‌గా తమ అనుబంధాన్ని మెరుగుపరుచుకునేందుకు ఓ గట్టి నిర్ణయం తీసుకోవడం చూసి అభినందించబుద్దేసింది. ఒకళ్ళని కలవడంకోసం ఇంకొకరు వీకెండ్ కోసం ఎదురు చూస్తున్నామనగానే పాత రోజులకు వెళ్ళిపోయారన్నమాట అని ఆటపట్టించింది కూడా..

ఇక రెండో విషయంలోకి వెళితే, తన కొలీగ్ ధరణి తీరు!

ఇంకా పెళ్ళికాని ఈ అమ్మాయి ఉన్నట్టుండి శాన్‌ఫ్రాన్సిస్కో డౌన్ టౌన్‌కి మకాం మార్చింది. అదేంటి! ఆఫీస్‌కి దగ్గరగా ఉన్న ఈ ఏరియా వదిలి అక్కడికి వెళ్ళావని శైలజ అడిగితే.

"ఈ శాంతాక్లారా, సాన్ హోజేలలో ఉంటే, హైదరాబాద్ లో ఉన్నానో... అమెరికాలో ఉన్నానో అర్థం కావడంలేదు. కనీసం ఇలా ఫ్రీ బర్డ్‌లా ఉన్నప్పుడయినా, సిటీలైఫ్, పార్టీ కల్చర్... ఉంటే బాగుంటుందనిపించింది. డాలర్లు ఎకువ పెడుతున్నానేమో కానీ, సాయంత్రం పూట... పదో అంతస్తులో ఉన్న నా అపార్ట్‌మెంట్ బాల్కనీలో నుంచుని.... మిరుమిట్లు కొలిపే లైట్ల కాంతిలో సముద్రాన్ని. సిటీని... గోల్డెన్ గేట్ బ్రిడ్జిని చూస్తూ.. ఎవరెస్టు మీదకి ఎక్కి ప్రపంచాన్ని చూసినంత ఫీలవుతుంటాను. మాటల్లో కుదించటం కష్టం కానీ... అదో గొప్ప

సంతృప్తి. ఇక వీకెండ్లో డౌన్‌టౌన్ నైట్ లైఫ్... సరేసరి! నేనే ఇలాంటి పని చెయ్యలేదు... ఆడపిల్లవయి ఉండి ఈ లైఫ్ స్టయిల్ అవసరమా అని మా అన్న గోలపెట్టాడు. కానీ ఈ మార్పు జీవితంలో ఎప్పటికైనా మరచిపోలేని ఓ అనుభూతి అవుతుంది అనడంలో సందేహం లేదు.. నా ముఖంలో గ్లో చూస్తే తెలియడంలేదూ..." అంది.

ఆ అమ్మాయి ధైర్యం. అనుకున్న జీవితాన్ని ఫాంటసీల్లో కాకుండా అనుభూతించి తీరాల్సిందేనన్న పట్టుదల కూడా ఆకట్టుకుంది శైలజని. అసలు వీళ్ళిద్దరినీ చూసిన తరువాత. వాళ్ళ ఆలోచనలు తెలుసుకున్న తరువాత తనేమైనా బోరుగా ఆలోచిస్తోందేమోనన్న అనుమానం, జీవితం పట్ల అంత ప్రేమతో లేదేమోనన్న సందేహం ఎక్కువయ్యాయి. ఆ పర్యవసానమే ఓ మంచి "మార్పు'ని వెతకాలనుకోవడం. ఆ మార్పు ద్వారా జీవితంలో కొత్త కాంతిని నింపుకోవాలని ఆశ,

అలా తను అనుకోగానే సరికాదు కదా! భార్యాభర్త ఇద్దరూ మనసు పడితేనే మార్పుకు త్రోవ చేసుకోగలుగుతారనే ఆలోచనతో మురళి దృష్టి కూడా ఇటు మళ్ళించే ప్రయత్నం మొదలుపెట్టిన శైలజకి, అనుకున్నంత రెస్పాన్స్ దొరకలేదు సరికదా!

"కొంపతీసి వసంత - రమేష్‌లలా మనం కూడా విడిగా ఉందామంటావా ఏమిటి? అమ్మలు అన్యాయం అయిపోతుంది..! కాలేజీ రోజుల్లో నీకోసం ఎదురు చూసినట్టు. మళ్ళీ పదేళ్ళు వెనక్కి వెళ్ళడం నా వల్లకాదు... అయినా లైఫ్‌లో ఎప్పుడూ ముందుకు పోవాలిరా... వెనక్కి కాదు. ఇక ధరణిలాగా ప్రవర్తించే వయస్సు మనకి దాటిపోయింది... కాబట్టి ఆ పన్లు చెయ్యటం కష్టమే! వాళ్ళకి టైముంది. కారణాలున్నాయి.... సమస్యలు కూడా ఉండి ఉంటాయి. కాబట్టి మార్గాలు వెతుక్కున్నారు. మనకేమీ లేకుండా ఎందుకు క్రియేట్ చేసుకోవాలి. నీకంత సరదాగా ఉంటే చెప్పు. మన ఇంట్లో ఉన్న ఫర్నిచర్ మార్చి, కొత్తగా డెకరేట్ చేద్దాం. అలాగే నువ్వు, నేను, అమ్మలు ముగ్గురం హెయిర్ స్టయిల్ మార్చేద్దాం... కొత్తబట్టలు కొనుక్కుందాం... ఇలా చేస్తే కనీసం ఓ రెండు రోజులపాటు అందరం కొత్తగా కనిపిస్తాం... నీ సరదా తీరుతుంది. నన్నడిగితే మన వరకు ఇంతకు మించిన మార్పులు ఏమీ అవసరం లేదని నా ఉద్దేశం.. నీకేమయినా వేరే ఉద్దేశాలుంటే చెప్పు" అన్నాడు జోక్ చేస్తున్నట్టుగా...

ఆ క్షణంలో, ఒకళ్ళ భాష మరొకళ్ళకి అర్థంకాని ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటున్నట్టు అనిపించింది శైలజకి.

నలుగురు మహిళలు కూర్చున్నప్పుడు, ఈ మగవాళ్ళకి ఓ పట్టాన ఏ విషయం అర్థంకాదు. అని ఎందుకు విసుక్కుంటారో మళ్ళీ ఓసారి గుర్తుచేసుకుని.

"నేను చెపుతున్న మార్పు తలలు మార్చడం, ఫర్నిచర్ కొనడం.... లాంటిది కాదు. ఓ ఆనందాన్ని లేదా అభిరుచిని, మరో ఆత్మ సంతృప్తిని వెతకడం. నిజమే! మనకే లోటూ లేదు... అలా అని ఓ చోట ఆగిపోలేం కదా. ఉదాహరణకి.. బాల్‌డాన్స్ నేర్చుకోవాలని నాకెప్పటి నుంచో కోరిక. నువ్వు పార్టనర్‌గా వచ్చావనుకో.. ఇద్దరం కల్సి నేర్చుకోవడం ఓ ప్లజర్ కాదంటావా? ఆలోచించు.. హౌ ఎక్సయిటింగ్!.. మనిద్దరం కలిసి కొంత రీసెర్చి చేసి మన "ఫ్యామిలీ ట్రీ" తయారు చేసి అమ్మలుకి ప్రెజంట్ చేసామనుకో... వచ్చే జనరేషన్‌కి ఓ బుల్లి హిస్టరీ బుక్ తయారు చేసినట్టేగా..? అలాగే నువ్వు, నేను, అమ్మలు కలిసి చేయతగ్గ ఫన్ యాక్టివిటీస్ ఏమైనా ఉన్నాయేమో వెతుకుదాం. ఫ్యామిలీ మూవీ టైం పెట్టుకుందాం... ప్రతి సంవత్సరం తప్పనిసరిగా వెకేషన్ తీసుకుందాం.. ఆలోచిస్తే ఇలా ఎన్నో చిన్న చిన్న ప్రయత్నాలు... Which will definitely make a difference in life....తమ భావాలు, మనసులో ఉన్న ఆలోచనల పట్ల వాళ్ళ నిజాయితీకి, వాటిని అమలులో పెట్టిన తీరుకు ప్రభావితం అయ్యానంతే! అందుకే, నేనేం నా స్నేహితురాళ్ళని కాపీ కొట్టాలనుకోలేదు... చిన్న చిన్న ఆనందాల్ని ఎలా పోగేసుకోవాలో కలిసి వెతుకుదాం అంటున్నాను. నువ్వు మనసు పెట్టి నేను చెప్పేది వినటం లేదు.." అంది.

"ఆడవారి మాటలకు అర్థాలు వేరన్నారు కదా అని పొరపాటు పడ్డానంతే! నా మనసే ఓ తెల్లని కాగితం... దాంట్లో నువ్వేం రంగులు అద్దినా చేసినా అప్పీలు లేదు.. ఫ్యామిలీ కమ్స్ ఫస్ట్" అని ముగించాడు మురళీకృష్ణ. ✡✡✡

# ఆరంగేట్రం

**ఎలాగైనా సరే** తమ కూతురికి ఏదో ఒక భారతీయ కళలో శిక్షణనిప్పించి, మంచి కళాకారిణిగా చూసుకుని మురిసిపోవాలనేది మురళీ కృష్ణ - శైలజల కోరిక. ఆడపిల్లకి అలంకారం అందం, అందునా మానసిక, శారీరక ఆరోగ్యాలకి నృత్యం మరింత ఉపకారి అనే భావనతో ఇద్దరూ ఓ నిర్ణయానికి వచ్చేసారు.

అదేంటో విచిత్రం! ఆ నిర్ణయం తీసుకున్న రెండు నెలల్లోపే, డాన్స్ నేర్చుకుంటున్న పిల్లల తల్లిదండ్రులు బోలెడంత మంది పరిచయం అయిపోయారు. ఇదెలా సాధ్యం.? ఇంతకు మునుపు వీళ్ళ గురించి మనకు ఎందుకు తెలియలేదోనని అప్పుడప్పుడూ శైలజ వాపోయినప్పుడల్లా,

"నువ్వు ప్రెగ్నెంట్ గా ఉన్నప్పుడు, సడన్‌గా ఎంత మంది ప్రెగ్నెంట్ ఉమన్ పరిచయంకాలేదూ... ఇదీ అంతే, మన దృష్టిలో ఏ విషయం ఉంటే, అలాంటి వారి గురించి మనకు తెలియకుండానే ఓ చెవి వేసి ఉంచుతా"మని మురళి తన పరిశీలనని భార్యకి గర్వంగా చెప్పుకొచ్చాడు.

డాన్స్ అనగానే వాళ్ళ గారాల పట్టి కూడా ఈజీగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది కానీ. శైలజకే సందేహాలు మొదలయ్యాయి. ఇంతకీ మన తెలుగు వారి కూచిపూడి బెటరా..? భరత నాట్యం అయితే ఒక వేళ అమెరికాలో ఏ మూలకి పోయినా టీచరు తొందరగా దొరికే అవకాశం ఉందా..? ఏ గురువుకి ప్రతిభ ఎక్కువో ఎలా వాకబు చెయ్యడం, దూరాభారాలు.. వగైరాలన్నమాట!

ఏది ఏమయినా, తమ కూతురికి నృత్యం చెప్పిద్దామనుకుంటున్నారు కనుక మంచి చెడులని అధ్యయనం చేస్తే సరైన నిర్ణయాలు తీసుకోగలుగుతామనే ఉద్దేశంతో, పిలిచిన వారందరి అరంగేట్రాలకు తుచా తప్పకుండా కూతురుతో సహా వెళ్ళారీ దంపతులు. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పుకోవాలండోయ్! ప్రతి వేసవి కాలంలోను బే ఏరియాలో "అరంగేట్రం సీజన్" ఒకటి కొనసాగటం గత కొన్ని సంవత్సరాలుగా వస్తున్న 'అప్రకటిత' ఆనవాయితీగా చెప్పుకోవాలి. ఎలాగో డాన్స్ చూడటానికి వెళుతున్నారు కాబట్టి, నృత్యానికి సంబంధించిన మేకప్, రంగు రంగుల డాన్స్ డ్రస్సులు, నగలు, జడ.. ఇలా అనేక వివరాలని అందంగా కూర్చి, ఊరిస్తూ... కూతురికి మళ్ళీ మళ్ళీ చెప్పి ఇంప్రెస్ చేసింది శైలజ.

కానీ ఓ రోజున.

"ఈ డాన్స్ ప్రోగ్రామ్‌లు వాటి రిక్వయిర్మెంట్స్ చూస్తుంటే మనం మనమ్మాయికి ఓ మంచి కళని పరిచయం చెయ్యాలని అనుకుంటున్నామా? లేదా ఓ ఫాల్స్ ప్రస్టేజ్ మ్యాటర్‌ని బుర్రలో నింపుతున్నామో అర్ధం కావడంలేదు" అంటూ ఓ బాంబు పేల్చాడు మురళి.

"అదేంటి! అంత మాట అనేశావు. ఏ కళ నేర్చుకోవాలన్నా ఈ రోజుల్లో ఖరీదయిన వ్యవహారమే! కాకపోతే క్లాసికల్ డాన్స్ మరింత ఖర్చవుతుందనిపిస్తోందని" సర్ది చెప్పబోయింది శైలజ.

"నిజమే! ఇండియాలో అయినా అమెరికాలో అయినా.. ముఖ్యంగా క్లాసికల్ డాన్స్ డబ్బున్న వాళ్ళ ఆర్ట్‌గా మారుతోంది. ఓ ఫాషన్ స్టేట్‌మెంట్‌లా.. కేవలం అరంగేట్రం ఇవ్వడం కోసం డాన్స్ నేర్చుకుంటున్న వాళ్ళు కూడా ఉన్న బ్యాక్‌డ్రాప్‌లో, ఇంతకీ మన అమ్మాయిని ఓ కళ నేర్చుకోవడానికి పంపుతున్నామా..? లేదా మార్కెట్ లోంచి ఏదైనా స్టేటస్ సింబల్ కొనుక్కొస్తున్నామా..?! డౌట్ గా ఉంది శైలూ.. కొన్ని అరంగేట్రాలకి వెళ్ళినప్పుడు నువ్వే చెప్పావు కదా ... ఇదేదో పెళ్ళికి వెళ్ళినట్టు ఉందని!" అన్నాడు మురళి.

"అరంగేట్రం డేట్ ఫిక్సయిందనగానే, చెన్నయి వెళ్ళి పట్టుచీరలు కొనడం, సంవత్సరం ముందుగానే థియేటర్ బుక్ చేసుకోవడం. ఆర్కెస్ట్రా వాళ్ళ డేట్స్ చూసుకోవడం, కాటరింగ్ ఆర్డర్‌కి మెనూ సెలక్ట్ చెయ్యడం, ఇన్విటేషనులు ప్రింట్ చెయ్యడం, పైగా అమెరికాలో అరంగేట్రానికి అందునా బే ఏరియాలో మినిమం పదిహేనువేల డాలర్లనుంచి ఓ మోస్తరుగా చెయ్యాలంటే పాతిక వేలని.. ఇక ఆ పైన ఎవరి ఖర్చుపెట్టగల సరదా వారిదనే లెక్కలు విన్నప్పుడు అలా అన్నాను. అయినా.. మనమ్మాయి ఇంకా నేర్చుకోవడమే మొదలు పెట్టలేదుగా.. అప్పుడే అరంగేట్రం దాకా పోతే ఎలా...?" అనే ప్రశ్న వేసింది శైలజ.

"నువ్వన్నదీ కరెక్టే! అరంగేట్రం చేస్తేనే డాన్స్ నేర్చుకున్నట్టు కాదుగా! ఎంత డబ్బు ఖర్చుపెడితే ఏం లాభం... సహజంగా ఆర్టిస్టులో ఆ ప్రతిభ ఉండాలి. పాత కాలంలో అరంగేట్రం అంటే, బాగా నేర్చుకుని, సాధన చేసి, అంతో ఇంతో నిష్ణాతులైన తరువాత చేసేవాళ్ళు.. ఇప్పుడా స్టాండర్డ్ గాలికి ఒదిలేసి, ఓ పది డాన్స్‌ల వరకు నేర్చుకుని చేస్తున్నట్టుగా ఉంది. మనం చూసిన ప్రతి పెర్ఫార్మెన్స్ కూడా బాగుందని చెప్పలేం కదా. నువ్వు  పరిశీలించావో లేదో, గ్రాండ్ గా అరంగేట్రం చేసుకుని, ఓ పనయిపోయిందంటూ వెనువెంటనే ఆ కళకి శుభం కార్డ్ పడేయాలనుకునే బాపతు వాళ్ళూ కనిపించారు. అలాగే చక్కగా నేర్చుకుని గుర్తింపు పొందాలనే వాళ్ళూ ఉన్నారనుకో" అన్నాడు.

చివరిలో మురళి అన్న మాటలు కొంత ఊరట కలిగించాయి కానీ, శైలజ మనసులో కూడా కొద్దో గొప్పో ఆందోళన లేకపోలేదు. ప్రతి సంవత్సరం చేసే డాన్స్ పెర్ఫార్మెన్స్‌లకు కుట్టించే డాన్స్ డ్రస్సుల దగ్గరనుంచీ.. నగలు కొనడం, అలాగే టీచర్ల జీతాలు, వాళ్ళకొచ్చే కమీషన్ల వరకు అనేక కోణాలపై తల్లితండ్రులు చేసే డిస్కషన్లు, కామెంట్స్ వినటంతో పాటు, అందరూ గ్రాండ్‌గా అరంగేట్రాలు చేసుకుంటుంటే అంత ఖర్చు పెట్టి చెయ్యలేకపోయిన తల్లితండ్రుల మీద అలిగిన, లేదా తోటి స్నేహితుల మధ్య చిన్నతనానికి గురయ్యి పేరెంట్స్ మీద అసహనం కనపరచిన పిల్లల కథలూ తను విన్నది.

"అంత ఖర్చుకు మేం రెడీనా?!" అన్న ప్రశ్న పదిసార్లు వేసుకున్న శైలజ "మనం డాన్స్ అంటు నేర్పించాలనుకుంటే అంతో ఇంతో ఖర్చుకి రెడీకాక తప్పదు. మనమే పిల్లకి డాన్స్ నేర్చుకో అని రకరకాల పద్దతుల్లో ప్రేరేపించి తరువాత ఖర్చు పెట్టలేనంటే తన మనసు నొచ్చుకోదూ.. సింపుల్‌గా చెప్పాలంటే, ఇక్కడ జరుపుతారు చూశావా టీనేజ్ పార్టీలని... అలాగే రాను రాను అరంగేట్రాలూ అయిపోతున్నాయి. నిజానికి మీ పిల్లల చేత అరంగేట్రం చేయించండి అని టీచర్లు అంతగా ఏం వెంటపడరు.. పేరెంట్స్ కి ఉండే ప్రెజర్ వల్ల ఇలా జరుగుతోంది" అంటూ తన ఆందోళనని వెలిబుచ్చక తప్పలేదు శైలజకి.

"అంటే, మనమీద కూడా ఆ ప్రెజర్ పడుతుందంటావా..? ఇటువంటి విషయాల్లోనే ఇద్దరం ఒక మాటమీద నిలబడాలి. మనకి మొదట క్వాలిటీ ముఖ్యం. బాగా దృష్టిపెట్టి నేర్చుకుని, తనకి డాన్స్ నేర్చుకోవడం పట్ల ప్రేమ, ఆసక్తి ఉంటేనే ప్రోత్సహిద్దాం. తనకి అంత డెడికేషన్, తపన ఉండాలేకానీ మనకున్నది ఒక్క కూతురు. ఆ మాత్రం ఖర్చు చెయ్యలేకపోతామా!? కాకపోతే నా బాధంతా గొప్పవైన ఈ కళల్ని డబ్బు.. ఆడంబరాలు డామినేట్ చెయ్యడం బాగా లేదనేదే.ఇటువంటి ఆర్భాటాల వల్ల పిల్లల మనసులకి రాంగ్ సిగ్నల్స్ పోతాయి. అయినా ఇలాంటి ఫంక్షన్లేవో ఇండియాలో చేసుకుంటే పోలేదూ. కనీసం బంధువులు, బాగా కావాల్సిన వాళ్ళని పిలిచినట్టయినా ఉంటుంది.." మరో ఆలోచన చెప్పాడు మురళి.

"అలా చేసేవాళ్ళూ లేకపోలేదు, కానీ చాలామంది టీచర్లు ఇష్టపడరు.. పైగా అక్కడ మీడియా కవరేజ్ అంటూ అసహ్యంగా డబ్బులిచ్చి రాయించుకునే పరిస్థితులూ ఉన్నాయిట. కాకపోతే ఈ విషయాలన్నీ మనం ఇలా ముందే మాట్లాడుకుంటున్నందుకు నాకు కొంత రిలీఫ్‌గా ఉంది. ఏమీ అవగాహన లేకుండా ఈ రంగంలోకి దిగి తరువాత చేతులెత్తేసే కంటే మనం బెటర్ కదా అనిపిస్తోంది" సమాధానపడటానికి ప్రయత్నించింది శైలజ.

నృత్యం అంటే మేకప్, నగలు వెలుగులే కాదు.. అదొక అలౌకిక ఆనందం.. పురివిప్పే మానసిక వికాసం.. నడకల ఆనవాళ్ళను పరిచయం చేసే ప్రణవం అంటూ... తమ కూతురికి మళ్ళీ మళ్ళీ చెప్పాలని ఇద్దరూ ఒట్టుపెట్టుకున్నారు.

✡ ✡✡

# బ్లాగింగ్

**వీరావేశం..** అంటుంటారు చూశారా..?! ఓ రోజు అచ్చం అలాంటిదే ఒకానొక ఆవేశం మన శైలజకి వచ్చేసింది. మురళీకృష్ణ ఆఫీసు నుంచి వచ్చిన ఐదునిమిషాలు కూడా కాకుండానే.

"నువ్వేం చేస్తావో నాకు అనవసరం. ఈ వీకెండ్ మాత్రం నువ్వు, అమ్మలు నన్ను డిస్టర్బ్ చేయకుండా వదిలేస్తే చేసుకోవాల్సిన పని చాలా ఉంది" అన్నది.

"ఈ మధ్య ఆఫీసు వర్క్‌లో అంత అర్జంట్ పనులేమీ లేవన్నావ్.. మరింక వీకెండ్లో అంత కష్టపడటం ఎందుకు?" అర్థంకానట్టు మొహం పెట్టాడు మురళీకృష్ణ.

"ఏం ... ఆఫీసు తప్ప వేరే పనులు, వ్యాపకాలు నాకు ఉండకూడదా? ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే, వాళ్ళని లంచ్‌కి పిలిచాను... వీళ్ళని డిన్నర్ కి పిలిచాను అనకుండా, అవీ ఇవీ వండిపెట్టమని నన్ను ఇబ్బంది పెట్టకుండా మీ పనులు మీరు చూసుకోండి" చెప్పింది.

"ఇంతకీ... ఆ అంత గొప్ప పని ఏమిటనే సస్పెన్స్‌కి తెరతీసి కొంచెం పుణ్యం కట్టుకోరాదా యువర్ ఆనర్." శైలజ వంక ఆసక్తిగా చూశాడు మురళి.

"ఇందులో సస్పెన్స్ ఏముంది? నేనో బ్లాగ్ మొదలు పెట్టాలనుకుంటున్నాను. దానికో పేరు. డిజైన్ అందులో ఏం రాయాలనే ప్లానింగ్ చేసుకోవాలి. ఈ పని ప్రశాంతంగా ఎటువంటి డిస్ట్రాక్షన్ లేకుండా చేసుకోవడానికి మీ ఇద్దరి సహకారం తప్పదు మరి!" అంటూ గుట్టు విప్పింది శైలజ.

"ఆర్డర్ వేశాక తప్పుతుందా! ఇంతకీ ఏం రాయాలనుకుంటున్నావ్? సడన్‌గా ఈ ఉత్సాహం ఎలా పుట్టుకొచ్చింది?" అడిగాడు.

"ఆల్రెడీ మా ఆఫీసులో ఇద్దరు బ్లాగర్లు ఉన్నారు. ఇద్దరూ అమెరికన్లే... రోజూ లంచ్ టైములో అవే కబుర్లు. వాళ్ళు ఏం రాస్తున్నారో విని, చదివిన తరువాత ఉత్సాహంగా అనిపించడమే కాకుండా.. నేను అంతకంటే బెటర్‌గా రాయగలనన్న నమ్మకం వచ్చేసింది. కాకపోతే, నేను రాసినవి ఆఫీసులో వాళ్ళతో చెప్పుకుని సరదా పడటంలో నాకంత మోజు లేదు. అందుకే నేను తెలుగులో రాద్దామనుకుంటున్నాను. రోజు ఎన్నో కొత్త సంగతులు తెలుసుకుంటాం, మొదట్లో వాటి గురించి ఎక్సయిట్ అవుతాం. తరువాత మర్చిపోవడం షరా మామూలే. అలా కాకుండా కొత్త అనుభవాలు, మారుతున్న ఆలోచనలతో ఓ పర్సనల్ డయిరీ మెయిన్ టెయిన్ చేసినట్టూ ఉంటుంది అనిపించింది" నా ఆలోచన కరెక్టా కాదా అన్నట్టు ఓ చూపు విసిరింది.

మన మురళీ కృష్ణకి భార్యని ఏ మాత్రం నిరుత్సాహపరిచే ఉద్దేశం లేదు. కానీ.

"పర్సనల్ డయిరీ అంటున్నావు. కొంపతీసి నా జీవితాన్ని నీ బ్లాగు ద్వారా నలుగురి పాలూ చెయ్యవు కదా!" అన్నాడు టీవీ ఛానల్స్ ఒకదాని తరువాత మరోటి సీరియస్‌గా మారుస్తూ.

చేతిలోని రిమోట్ తీసేసుకుని, ఎదురుకుండా కూర్చుని, ఇప్పుడు చెప్పు...

"ఏమిటి నీ ప్రాబ్లం?" అంది శైలజ.

"మరేం లేదు బంగారం. ఏ రోజైనా నా మీద కోపం వచ్చి తగాదా పడి ఆ కోపంలో బ్లాగంటే పర్సనల్ డైరీ లాంటిది కదా అని... మా ఆయన దుర్మార్గుడనో, బొత్తిగా జాలీ దయా లేని వాడనో రాసి పారేశావనుకో, నా పరువేం కాను అసలే భార్యాభర్తలం... రెండు గంటల కింద ఉన్న అభిప్రాయం ఇప్పుడు ఉండకపోవచ్చు. కానీ ఒకసారి నాపై రెండు అక్షింతలు పబ్లిష్ చేసిన తరువాత, మా ఆయన ఎంతో అద్భుతమైన మనిషి అని వందసార్లు రాసినా చదివే వాళ్ళు పట్టించుకోరు. నన్ను నమ్ము. అసలే తెలుగు వాళ్ళు తమ అభిప్రాయాల్ని తొందరగా మార్చుకోరట. నీకేమో పట్టలేని ఎమోషన్, ఆపైన తెలుగులో రాస్తానంటున్నావు. నేను - నువ్వు అంటే "మనమే!" ఒకవేళ "నీ" జీవితం గురించి రాసుకున్నా... నేను కూడా అందులో వస్తాను కదా... అసలు మన సోది ప్రపంచానికి ఎందుకు చెప్పు... నన్నడిగితే బ్లాగులో "పర్సనల్ డైరీ" అన్న కాన్సెప్ట్ అంత బోరు వ్యవహారం ఇంకోటి లేదు" అని ప్రకటించాడు పైగా, నేనేం రాసుకుంటే నీకెందుకు? జోకులేస్తున్నావా...!? అని శైలజ అనేలోపే,

చిన్నప్పుడు చదువుకున్న సోషల్ స్టడీస్ పాఠం "బోస్టన్ టీ పార్టీ" గొడవలో అమెరికా - బ్రిటన్‌లు ఏం తేల్చుకున్నాయన్నది మనకు అనవసరం కానీ... ఆ గొడవలోని "టీ" మాత్రం ఇండియాదేనని, అలాగే అమెరికాలోని కొందరు స్మార్ట్ పొలిటీషియన్లు ప్రచారానికి వెళ్ళేప్పుడు తాము వెళ్ళే కమ్యూనిటీలోని మెజారిటీ ప్రజల జుట్టు రంగుని పోలిన డై వేసుకుంటుంటారని.. బాగా గమనించి చూస్తే మన ఇండియాలో సోనియాగాంధీ ప్రతిపక్షాల "విదేశీ" బ్రాండ్ ఇమేజ్‌ని తగ్గించుకునే ప్రయత్నంలో డార్క్ షేడ్ డై వాడుతున్నట్టనిపిస్తోందని కావాలంటే, ఒకప్పుడు బంగారు వన్నెతో ఉన్న ఆమె జుట్టు కలర్ని ఇప్పటి రంగుని పోల్చుకోమని నీకు నచ్చినట్టుగా రకరకాలుగా రాసుకోవచ్చు. ట్రై ఫర్ ఇంట్రస్టింగ్ థింగ్స్." అంటూ ఓ ఉచిత సలహా పడేశాడు.

పాపం శైలజకి కూడా ఏం రాయాలి, ఎలాంటి నియమాలు లేదా లక్షణ రేఖలు గీసుకోవాలి అనే విషయంలో చాలా కన్ఫ్యూజన్ ఉంది. కానీ తన మనసుకి దగ్గరగా అనిపించేవి, మనిషిగా స్పందించాల్సిన విషయాలు, విజ్ఞానం పంచుకోవాలని ఉబలాటం! నిజానికి శైలజ తెలుగులోనే తన బ్లాగుని రాయాలనుకోవడంలో ఒక ఉద్దేశం ఉంది. ఇండియాలోను, అమెరికాలోను - అలాగే ప్రపంచం నలుమూలలా ఉన్న తన క్లాస్మేట్స్ - ముఖ్యంగా స్నేహితురాళ్ళని పోగేసి, అందర్నీ తలా ఒక బ్లాగు స్టార్ట్ చెయ్యమనే ప్రపోజల్ పెట్టాలని, వీలైతే ఓ గుంపులా (గ్రూప్) ఏర్పడటం ద్వారా అనుభవాలని ఫ్రెండ్సందరూ పంచుకుంటూ ఒకళ్ళతో మరొకళ్ళు తరచూ మాట్లాడుకుంటున్న ఫీలింగ్‌తో పాటు, ఎంత దూరాన ఉన్నా ఒక కట్టుగా ఉన్నామనే అనుభూతిని సొంతం చేసుకోవచ్చనుకుంది. ఈ ప్రపోజల్ మిగతా ఫ్రెండ్స్‌కి చెప్పే ముందు తను బ్లాగ్ తయారు చేసి లింక్ పంపితే, మిగతా వాళ్ళకి కూడా ఉత్సాహం వస్తుందనే ఆలోచన తనది. ఆల్రెడీ ఫేస్ బుక్, ఆర్కూట్, ట్విట్టర్ లాంటివి ఉన్నా, బ్లాగు ఇంకా పర్సనల్‌గా ఉంటుందనుకుంది. ఇదంతా మురళికి వివరించగానే..

"ఓ... కొత్త పేరంటం అన్నమాట! అవునూ నేను కూడా నీ క్లాస్మేట్‌నే కదా కేవలం స్నేహితురాళ్ళతోనే గ్రూప్ కట్టాలనుకోవడంలో ఉద్దేశం ఏమిటీ? ఈ పేరంటానికి ఆడా మగా తేడాల్లేవు. అమ్మాయిలే బాగా రాస్తారని నాలాంటి మగ క్లాస్మేట్స్‌ని కూడా పిలవడంలో తప్పులేదేమో! అమ్మాయిలందరూ బాగా రాసేస్తారని గ్యారంటీ లేదుగా రాయగలిగిన వాళ్ళు రాస్తారు. కౌన్సిలింగ్, జాబ్ టిప్స్.. ఇలా ఎవరికి తోచిన పని ఎవరి బ్లాగుల్లో వాళ్ళు చేస్తారు. ఏమీ చెయ్యలేని వాళ్ళు గ్రూపుని ఫాలో అవుతారు. గుర్తుందా.. ఇంజనీరింగ్ చదువుతున్నప్పుడు, మన క్లాసు లో జరిగే విశేషాలు, ఫన్నీ థింగ్స్, గాసిప్స్ అన్నీ కలిపి ప్రతినెలా రెండు పేజీల న్యూస్ లెటర్లా చేసి, కాపీలని తీసి ఐదు రూపాయలకి అమ్మేవాళ్ళం!" అన్నాడు.

శైలజకి కూడా ఆ రోజులు గుర్తొచ్చి క్యూట్‌గా అనిపించింది. జెండర్ తేడా లేకుండా గ్రూప్ కట్టి బ్లాగులు నడిపితే ఇంకా ఆహ్లాదంగా, పరస్పరం అందరికీ ఉపయోగకరంగా ఉంటుందనిపించింది. కానీ, ఈ "పేరంటం" అనే సంబోధనే పంటికింద రాయిలా. అడ్డుపడింది.

"నీకు మరీ నోరు ఊరుకోదు... లేకపోతే చిరాగ్గా పేరంటం ఏమిటీ" అని విసుక్కుంది.

మురళి తన "పదప్రయోగం"లో ఎటువంటి తప్పులేదన్నాడు. తమ కూతురి డాన్స్ క్లాస్ దగ్గర ఓ తెలుగు బ్లాగర్ పరిచయం అయ్యాడని, ప్రతివారం, గంటపాటు జరిగే డాన్స్ క్లాస్ సమయంలో, ఆయనతోనే బాతాఖానీ వేస్తూ బోలెడన్ని విషయాలు తెలుసుకున్నానని వివరిస్తూ...

"బ్లాగులు రాయగానే సరికాదు, చదివి ప్రోత్సహించే వాళ్ళు కావాలి కనుక, సాధారణ బ్లాగర్ ఎవరైనా ఏదో ఒక గుంపులో చేరక తప్పదు. చేరిన తరువాత తన పేరు ప్రమోట్ చేసుకోవడానికి, లేదా తనొకడు ఉన్నాడనే ఉనికిని చాటుకోవడానికి, ఇతరుల బ్లాగులకి వెళ్ళాలి, వాళ్ళు నోటీసు చేసేట్టు కామెంట్లు పెట్టి, తన బ్లాగు చదివేంత వరకు లాక్కురావాలి. ఇలా మొదలైన తతంగం, గ్రూపులు కట్టేవరకూ అచ్చం పేరంటంలా - నా బ్లాగుకి నువ్వొచ్చి కామెంటు పెడితే, నేనూ నీకు కామెంటుతా అనేంత వరకూ "కల్చర్" నడుస్తోందట.. ఈ ప్రాసెస్‌లో కొన్ని చిన్న చిన్న భజన సంఘాలు.... మ్యూట్యువల్ అడ్మిరేష్యన్ క్యాపులు పుట్టుకొచ్చి వినోదాన్ని పంచుతున్నాయట కూడా. ఇంకా చాలా మురికితనం కూడా ఉంటోందని చెప్పాడనుకో... వినడానికే విసుగేసింది..." అన్నాడు.

ఈ మాటలు విన్న శైలజ ఒక అడుగు వెన్నకి తగ్గింది కానీ, ఎన్ని పాట్లు పడి, లేదా అడ్డుదారుల్లో బ్లాగు పాఠకుడిని/పాఠకురాలిని తీసుకుపోయినా విషయం లేనిదే - అది ముందుకు సాగడం కష్టం. పైగా ఏదైనా ప్రక్రియ మొదలైన కొత్తలో అంతా గందరగోళంగా ఉంటుంది. అందరూ తలా ఓ చేయీ వేస్తే కానీ ఆ పనిలో ఎదుగుదల ఉండదు. స్నేహితులందరూ ఒక గ్రూపులో ఉంటారు కాబట్టి తమకి అంత పెద్ద సమస్యలేమీ ఉండవనిపించింది శైలజకి. చిన్న చిన్నవి ఉన్నా సరిదిద్దుకోవడం కష్టం కాదనే అభిప్రాయం తనది. దాంతో అసలు నువ్వు చెప్పిన కారణాలు పెద్ద సీరియస్‌గా తీసుకోవాల్సినవి కాదని ప్రపంచం అంతా ప్రయోగాలతోనే నడుస్తోందని చెప్పింది మురళితో.

"నీ ప్రయత్నం మానెయ్యమయ్యమనో, నిరుత్సాహ పరచాలనో నేను ఇవన్నీ చెప్పలేదు. కాకపోతే రాయడం అంటూ మొదలుపెట్టిన తరువాత, అది అందరూ చదవాలని, మెచ్చుకోవాలని, గుర్తింపు రావాలని అనుకోవడం సహజం. ఎవరికి వాళ్ళు తాము బాగా రాశామనుకుని, తోటి వారికి ప్రశంస దక్కితే తట్టుకోలేకపోవచ్చు. అందుకే దాని మీద అతిగా అంచనాలు పెట్టుకుని, నిరుత్సాహ పడతావేమోనని ముందుగానే, గ్రౌండ్ రియాలిటీస్ వాస్తవాలని వివరిస్తున్నాను. ఒబామా ఎన్నికయినప్పుడు జరిగిన ఎన్నికల్లో, ప్రధాన మీడియా కంటే కూడా కొన్ని సార్లు బ్లాగులు నిర్వహించే వాళ్ళు చురుగ్గా న్యూస్ ఇచ్చారని, వాళ్ళు ఇచ్చిన ఇన్పుట్స్‌ని తీసిపారెయ్యడమో, నిర్లక్ష్యం చేయడమో చెయ్యలేకపోయామని స్వయంగా సి.ఎన్.ఎన్ ఛానల్ చెప్పుకుంది. అలా రాసేవేవో కొంచెం ఉపయోగపడేవి, వర్త్ ఉన్నవి అయితే బాగుంటుందని నా అభిప్రాయం" అని వివరణ ఇచ్చాడు మురళి.

"చూడు మళ్ళీ చెపుతున్నాను నా బ్లాగులో ఏం రాసుకోవాలనేది నా ఇష్టం. నీ ఉద్దేశాలు, అభిప్రాయాలు... అలాగే ఎలా రాయాలి అనే రూల్స్.. నువ్వో బ్లాగ్ పెట్టుకో.. రాసుకో.. వీలయితే చదివి కామెంటు పెడతా" స్పష్టం చేసింది శైలజ

✡✡✡

## తెలుగు "అసోసియేషన్"

**శైలజకి, మురళీ కృష్ణకి** అమెరికాలోని తెలుగు సంఘాల్లో కనీసం ఒక దాంట్లో అయినా సరే చేరాలనిపించింది. ఇన్నాళ్ళూ ఈ మోటివేషన్ ఏమయింది? ఒకవేళ చేరితే ఎలాంటి లక్షణాలున్న సంఘాన్ని ఎంపిక చేసుకోవాలి? అని మొదట్లో తర్జనభర్జన పడ్డారు.

తెలుగు సంఘంలో చేరాలనిపించడానికి మొదటి కారణం తమకో కూతురు పుట్టి, బాధ్యత రావటమే అని తేల్చుకున్నారు. తమ ఈ ప్రయత్నం వల్ల అనేక తెలుగు కుటుంబాలతో పాటు, తరచూ జరిగే కార్యక్రమాలు, వినోదాల ద్వారా తెలుగుదనం గురించి తమ కూతురికి మంచి అవగాహన ఏర్పడటం, అలాగే తన అస్థిత్వం పట్ల ఎటువంటి సంకోచం, సందేహాలు లేకుండా ఎదిగేందుకు ఒక బ్యాక్ డ్రాప్ తయారు చేసినట్టు అవుతుందని భావించారు. ఇక మిగతా విషయాలకి వస్తే, తమ ప్రాంతం, భాష, సంస్కృతి పట్ల అభిమానంగా ఉండటం, వాటిని పరిరక్షించుకునే సంకల్పంతో చేపట్టే కార్యక్రమాలు, తెలుగు వారికి కష్టకాలంలో అండగా నిలిచే ఆర్గనైజేషన్స్‌లో చేరడం సరి అయిన చర్యగా, అది తెలుగువారి బాధ్యతగా భావించారు.

కానీ, అమెరికాలో ఈ మధ్య అనేక తెలుగు ఆర్గనైజేషన్స్ పుట్టుకొచ్చాయి. దాంతో ఏ సంస్థల్లో చేరాలన్నది ఒక ప్రశ్న. అందులోను, అమెరికాలో చాలా తెలుగు సంఘాలకి ఫలానా "క్యాస్ట్ బ్రాండ్" అనే ముద్ర కూడా ఉండటంతో, బావిలో కప్పల్లాగా, ఓ బావిలో పడి ఉండాల్సి వస్తుందేమో?! అని భయపడ్డారు.

"మా ప్రాంతం, మా భాష, మా యాస అనుకోగా లేనిది, మా కులం అనుకుంటే తప్పేంట"ని వాదించే కొందరు సన్నిహితుల వాదనల్ని నెమరువేసుకున్నారు. అసలు ఇటువంటి ధోరణుల్ని భరించగలమా? లేనిపోని తలనెప్పుల్లోకి వెళుతున్నామా? అటు కొంత సేపు ఆందోళన కూడా పడ్డారు.

అంతలోనే మురళీ కృష్ణ తేరుకుని, మనకి ఓపిక ఉండాలే కానీ, ఒకటేమిటి నాలుగైదు సంఘాల్లో చేరొచ్చు. ఇలాంటి సంకుచితమైన విషయాలని బూచిలా చూడటం తగదని వివరిస్తూ, మనుసుండాలి కానీ మార్గాలెన్నో అన్నాడు. ఇక చేరడం ఖాయమే అనుకున్న తరువాత, స్థానికంగా చురుగ్గా ఉన్న ఆర్గనైజేషన్ అయితే తాము అనుకున్న ఉద్దేశానికి బాగుంటుందనుకున్నారు.

"ఇక నీ చీరలు, పంజాబీ సూట్లకి, నగల సెట్లకి డిమాండ్ పెరిగినట్టే! రంగంలోకి దిగి అన్నీ రెడీ చేసుకో.. "ఒకానొక ఆర్గనైజేషన్ సభ్యత్వం తీసుకున్న మురళి జోక్ చేశాడు శైలజతో.

"అవున్లే. మీ తండ్రీ కూతుళ్ళిద్దరికీ ఏమీ కొనకుండా అన్నీ నేనే కొనుక్కుంటున్నా. ఖరీదైన షేర్వానీలన్నీ ఎవరి కోసం కొన్నారో?!" మాటకి మాట తగిలించింది శైలజ.

"వాటెవర్! క్లాసెట్లో ఓ మూలపడి ఉండకుండా. వాటితో ఇక రెగ్యులర్‌గా పని పడుతోంది కదా" అన్నాడు.

ఓ సంవత్సరం పాటు దంపతులిద్దరూ సదరు తెలుగు అసోసియేషన్ కార్యక్రమాలకి మహా ఉత్సాహంగా వెళ్ళారు. ఆ సంస్థ నిర్వహించే కార్యక్రమాలకి అంతో ఇంతో సేవాదానం చేసి, "మేము సైతం..." అంటూ ఫీలయ్యేవారు. ఒక సంవత్సరంలోనే తన సోషల్ నెట్‌వర్క్ ఎంతలా డవలప్ అయ్యిందో మాటమాటకీ బేరీజు వేసుకుని మురళి ఆశ్చర్యపోతుండేవాడు. శైలజకి కూడా తమ సంస్థ చేసే కార్యక్రమాలకి వెళ్ళడం, చేతనయినంత సహాయపడటం అంటే, బంధువుల ఇంటి వేడుకకి వెళ్ళినట్టుగా ఉత్సాహంగా అనిపించేది.

ఈ భార్యాభర్తల ఆసక్తి, చురుకుతనం గమనించిన ఆర్గనైజేషన్ పెద్దలు మురళికి బాధ్యతగల ఓ పోస్టు కూడా అప్పగించారు. అక్కడ మొదలైంది అసలు కథ! ఏ కార్యక్రమం జరిగినా ఒళ్ళు హూనం అయ్యేట్టు పని చేసి, వారం పది రోజుల వరకు ఆ బడలిక నుంచి బయటపడలేకపోయే మురళిని చూసి జాలి పడేది శైలజ.

మొహమాటానికో, తప్పనిసరి అయ్యో ఇండియా నుంచి లేదా మరో చోటునుంచి కళాకారులో, సాహిత్య కారులో వస్తే అతిధ్యానికి ఒప్పుకుని, చిరునవ్వుతో, జీవితంలో బోలెడంత రికామీగా ఉన్నట్టు ముఖం పెడుతూ మర్యాదలు చేసి, తీరావాళ్ళు వెళుతూ, వెళుతూ...

''మీరెంతో బాగా చూశారు, కానీ మీరు మా ప్లేసుకి వస్తే ఇలా చూసే సమయం ఉంటుందో లేదో..''

అనగానే, ఏమనాలో తెలీక, తనకెంత తీరిక తక్కువైనా  వాళ్ళకోసం ఎలా సమయం చేసుకోగలిగిందో చెప్పలేక ఓ వెర్రి నవ్వు నవ్వే శైలజని చూసి మురళికి కడుపుతరుక్కుపోయిన సంఘటనలు ఎన్నో .

''ఇలాంటి వాటి వల్ల మనకు వచ్చేదీ లేదు, చచ్చేదీ లేదు, పైగా మన పర్సనల్ టైం అంతా పోతుంది. వీటికి తోడు ఈ ఆర్గనైజేషన్లలో రకరకాల పాలిటిక్స్... ఎవరికి వారు తమను ప్రమోట్ చేసుకుందామని తాపత్రయపడేవాళ్ళే. పైగా కష్టపడి చాకిరీ చేసే వాలంటీర్లని కూడా టికెట్ కొనుక్కుంటే కానీ సంస్థ చేసే కార్యక్రమాలకి రానివ్వమంటారు. ఇదేమైనా బాగుందా? సంస్థ ఫండ్స్ అన్నీ ఏమవుతున్నాయో మీ ఆయన్ని ఆరా తీయమని వాళ్ళు మొహం మీదే అడుగుతుంటే, ఏం చెప్పలేకపోతున్నాను. రకరకాలుగా గాసిప్పులు, తగాదాలతో ఎందుకొచ్చిన తలనొప్పి చెప్పు, మనవల్ల కావడం లేదని చేతులెత్తేద్దాం'' అని విసుగొచ్చినప్పుడల్లా అనడం శైలజకి పరిపాటి అయిపోయింది.

నింపాదిగా శైలజ మాటలు విన్న తరువాత,

''చూడు! అమెరికాలోని వివిధ సంఘాల్లో టాప్ పొజిషన్స్‌లో ఉన్నవాళ్ళు. ఒకప్పుడు మనలాంటి వాళ్ళే.. వాళ్ళు కూడా ఇలా మధ్యలోనే వదిలేసి, తమ పని తాము చూసుకుంటే చాలు అనుకుంటే ఈ స్థాయిలో, అంటే తెలుగు కమ్యూనిటీకి నాయకులుగా ఉండగలిగేవారా? ఈ రోజుల్లో, అమెరికాలో ఏ మూల ఏ సంఘటన జరిగినా ఏదో ఒక సంఘం నిలబడి సహాయం చేస్తోందంటే నిబద్ధత ఉన్న వ్యక్తులు ఉండటం వల్లే. ఇక్కడే కాదు, ఇండియాలో కూడా వివిధ సంఘాల నాయకులకి ఎంత విలువ ఉందో మీడియాని ఫాలో అయితే తెలుస్తుంది. ''ఎయిమ్ బిగ్'' అనే పాలసీ పెట్టుకుని పని చేస్తే ఇంతలా డీలా పడిపోవు'' అని చెప్పాడు మురళి.

''ఏంటీ! నా చెవిలో కాలీఫ్లవర్‌లాంటిదేమైనా కనిపిస్తోందా? రకరకాల ఆర్గనైజేషన్స్‌లో ఉన్న పెద్దమనుషులందరూ మనలా చాకిరీ చేసి ఆ పోస్టులని పొందలేదు. వాళ్ళల్లో సగం మందికి పైగా వ్యాపారస్తులు. అంతో ఇంతో డబ్బు పెట్టి, ఏదో ఒక పొజిషన్‌కి జంప్ చేసెయ్యగలరు. వాళ్ళల్లో చాలా మందికి రకరకాల, ఉదాహరణకి రాజకీయ, వ్యాపార సంబంధమైన అనేక ఉద్దేశాలు, ప్రయోజనాలు ఉంటాయి. ఉద్యోగాలు చేసుకునే మనకి అంత తీరికా, స్థోమత ఉందంటావా?

అసలు మానేద్దామనడం లేదు. మన పాత్రని పరిమితం చేసుకుందాం. ఎవరికైనా సాయం చెయ్యాలనిపిస్తే, మనకి తోచినంత వ్యక్తిగతంగా కూడా చేద్దాం. ఎప్పుడూ ఆర్గనైజేషన్ కి అనుబంధంగానే ఎందుకు చెయ్యాలి'' అంటున్నాను అంది శైలజ.

''శైలూ, నీ పరిధి అంతే, అంతకు మించి ఆలోచించలేవు. ఎల్లకాలం నేను ఇలా ఉద్యోగమే చెయ్యాలని ఏమైనా రూల్ ఉందా? ఏమో కొన్ని ఏళ్ళలో బిజినెస్ మొదలుపెడతానేమో? నీకు తెలుసో లేదో, ఒంటరిగా ఉండే కంటే, ఓ గుంపులో ఉన్నప్పుడు బాగా సహాయం దొరుకుతుంది. పైకి వెళ్ళే వాడి కాళ్ళు పట్టిలాగుతున్న ఇంకోడ్ని చూసామంటే, కచ్చితంగా వాళ్ళు ఇద్దరూ తెలుగువాళ్ళు అయివుంటారని మనలో మనం ఎన్ని జోకులు వేసుకున్నా, పరాయిదేశంలో ఇన్ని తెలుగు సంఘాలు పుట్టుకొస్తున్నాయి, మనగలుగుతున్నాయి అంటే, వాటి అవసరం, అలాగే వాటిమీద కొంతమందికైనా నమ్మకం ఉండటం వల్ల, ఇక పవర్ పాలిటిక్స్, తగాదాలు, గాసిప్పులంటావా మన ఇళ్ళల్లో లేవు..'' అన్నాడు.

''ఇంతకీ ఎప్పటికైనా, తెలుగు సంఘాలకి నాయకుడవ్వాలనే కోరిక ఉందంటావు. కానీ మనం మొదలుపెట్టింది ఈ కోరికతో కాదు. అంటే నువ్వు కూడా ఇలాంటి సంఘాలు నిచ్చెన లేసుకోవడానికే అనే ట్రాప్‌లో పడిపోయావు. ఈ హోల్ ప్రాసెస్‌లో తెలుగు

వాళ్ళు తెలుగుదనం తెలుగు సంస్కృతి... వీటి మీద ప్రేమ ఇవన్నీ అలంకారాలే. మానవీయ దృక్పథం అక్కడక్కడా అగుపించొచ్చేమో కానీ, చాలా మంది నువ్వు చెప్తున్న సోకాల్డ్ తెలుగు కమ్యూనిటీ లీడర్స్ తీరు "తెలుగు" పేరు చెప్పి నిచ్చెనలెక్కాలనుకుంటున్నట్టుగా సూటిగా చెప్పింది శైలజ. "

"నీకింకా అర్ధం కావడం లేదా... అసలీ నిచ్చెనలెక్కడం అనే పనిలోనే తెలుగుదనం అంతర్లీనంగా ఉంది." అని చెప్పిన మురళీ కృష్ణకి,

ఓ నమస్కారం పడేసింది శైలజ..

# షాపింగ్, సేల్స్, మాల్...

**ఆ మధ్య ఇండియా ఫోను** చేసినప్పుడు, తన చిన్ననాటి స్నేహితురాలు ఒకరితో, చాలా కాలం తరువాత శైలజ మాట్లాడింది. కొన్ని సంవత్సరాలు అయిందో ఏమో, ఒకదాని తరువాత మరోటి, పాత జ్ఞాపకాలన్నీ తిరగేసుకున్న తరువాత, అమెరికాలో ఎన్నారైల లైఫ్ స్టైయిల్ గురించి ముచ్చటించుకున్న సందర్భంలో

"ఈ వారం అక్కడ సేల్ ఉంది. ఇక్కడ డిస్కౌంట్ ఉంది అంటూ షాపుల చుట్టూ తిరిగి, నాలుగు డాలర్లకే బ్రాండెడ్ దొరికింది. ఆరేడు డాలర్లకే మంచి జీన్స్ దొరికింది అని సంబరపడిపోతూ ఉంటారటగా! ఈ మధ్య అమెరికా నుంచి ఓ కుటుంబం వచ్చి మా పక్క అపార్ట్‌మెంటులో అద్దెకు దిగారులే! వాడిన వస్తువులైనా, ముప్ఫయి రోజులలో తిరిగి ఇచ్చేసే పాలసీ అమెరికాలో ఉంది. ఇండియాలోనే మరీ లూటీ చేస్తున్నారని ఆవిడ బాధపడిపోతూ ఉంటుంది. నిజమేనా! " అడిగిందా చిన్ననాటి స్నేహితురాలు.

నిజమనో, కాదనో, అసలు ఎలా సమాధానం చెప్పాలో తెలియక తికమకపడిన శైలజకి, ఆ 'పక్క అపార్టుమెంటు' ఆవిడ మీద మాత్రం విపరీతమైన కోపం వచ్చింది. అమెరికా అంటే ఇవ్వాళ రేపు అందరికీ చీపు అయిపోయింది. ఇక ఇక్కడి నుంచి వెళ్ళి, అలా చెప్పేవాళ్ళుంటే మరీ అర్ధ్వానం అయిపోగలదు. ఒకరిద్దరు అలా అనుకుంటే, అమెరికాలో ఉన్న తెలుగు వాళ్ళందరూ అలాగే ఉంటారని, ఆలోచిస్తారని ఎలా అనుకుంటారు? కానీ ఎవ్వరి నోటినీ కంట్రోలు చెయ్యలేం కదా అని వాపోయింది శైలజ. ఇదే మాట మురళితో అంటే

"ఓ ఇరవై వేల డాలర్లు షాపింగ్‌కి వదిలించిన తరువాత కూడా, ఈ మధ్య ఇండియా వెళ్ళొచ్చి నువ్వేమన్నావు? అందరూ స్టేటస్ మెయిన్టైయిన్ చెయ్యడానికి తాపత్రయ పడుతున్నారు. అమెరికాలో ఉండి నేను ఒకటికి పదిసార్లు ఆలోచిస్తున్నానేమో. డబ్బు అంటే లెఖ్ఖ లేకుండా పోతోంది. లక్షల రూపాయలని అలవోకగా చీరల మీద, నగల మీద, ఆర్భాటాల మీద, అందానికి మెరుగులు దిద్దుకోవడానికి ఖర్చు పెట్టేస్తున్నారని అనలేదూ..! కాలానుగుణంగా అక్కడ కూడా లైఫ్ స్టయిల్ మారుతుండొచ్చు కానీ, నిజంగా ఇండియాలో అందరూ అలా ఖర్చు పెట్టగలరంటావా?. ఆ 'పక్క అపార్టుమెంటు' ఆమె తన అనుభవం చెప్పింది. అవి విన్న నీ స్నేహితురాలు నిన్ను అడిగింది. అంత వరకే తీసుకుని నువ్వు కూడా నీ అభిప్రాయం చెప్పు. ఇలా ఎందుకు చెప్పిందని గింజుకోవడం ఎందుకు?"

ఇట్లాంటి కబుర్లు ఏమీ తనతో చెప్పకూడదని ఎప్పటికప్పుడు అనుకుంటూనే, తప్పు చేస్తుంటానని నొచ్చుకుంటూనే,

"భలే చెపుతున్నావే! ఈ దేశంలో 'బెస్ట్ బై', 'సర్క్యూట్ సిటీ' లాంటి స్టోర్‌లు ఎలా నడుస్తున్నాయంటావు? నీ లాంటి వాళ్ళ వల్ల కాదు! ఎర్లీ బర్డ్ సేల్ అంటూ పొద్దున్నే నాలుగు గంటలకే పోయి నుంచుని, అవసరమైనవీ, కానివీ కొని ఎన్ని దుబారాలు చెయ్యలేదూ... మాల్‌కి వెళ్ళినప్పుడు అవసరం ఉన్నా లేకపోయినా, ఎలక్ట్రానిక్ షాపుల్లో దూరిపోతుంటావు! పక్కవాడు ఏ లేటెస్టు మోడలు కారో, ఎలక్ట్రానిక్ ఐటమో కొన్నాడంటే, ఎప్పుడు కొనాలా అని ఉబలాటపడిపోతుంటావే? అలా.. నువ్వు ఏరి కోరి తెచ్చుకున్న వస్తువుని, గరాజ్ సేల్‌లో కొన్నావా? డాలర్‌కా, ఐదు డాలర్లకా, మీరెప్పుడూ ఇంతేనటగా అంటే ఫీలవ్వవా? " నిలదీసింది శైలజ.

" మరీ అసహజంగా అడిగితే కొంచెం ఫీలవుతాననుకో! కాకపోతే అది అవతలి వ్యక్తిని బట్టి ఉంటుంది. మొన్నీ మధ్య ఇండియా నుంచి అమెరికా వచ్చిన నా స్నేహితుడొకడు అమెరికా రాగానే ఎవరికైనా పెరిగేది ఒంట్లో కొవ్వు, ఇంట్లో సామాను అన్నాడు. బే ఏరియాలో జరిగే 'జెమ్స్ షో'కి తీసుకెళితే చేపల మార్కెట్తో పోల్చాడు. అమెరికా అంటే షాపులు, మాల్సే అన్నట్టు వేలం వెర్రిగా తిరిగిన రోజులు గుర్తుకు తెచ్చుకుని, నవ్వుకుని ఊరుకున్నాను. నీలా దాని గురించి ఓ టాపిక్ పెట్టలేదు. అసలు మీ లేడీస్ తో ఉన్న ఇబ్బందే ఇది. ప్రతి విషయాన్నీ భూతద్దంలో చూస్తారు. ఇంతకీ నీ స్నేహితురాలు నిన్ను కూడా ఐదు డాలర్లకి, పది డాలర్లకి అన్నీ కొనుక్కుంటావని అనుకుంటుందనా నీ బాధంతా? " సూటిగా పాయింట్‌కి వచ్చేశాడు మురళి.

అది కూడా ఒక పాయింటే! లేడీస్.. షాపింగ్ అనగానే చాలా మంది స్టీరియో టయిపు విశ్లేషణలు చేస్తుంటారు. కానీ షాపింగ్ కూడా ఒక ఆర్ట్! చేతిలో డబ్బులు ఉన్నాయి కదా అని వెచ్చించడం కాదు. కళాత్మకమైన దృష్టితో కావలసినవి అమర్చుకోవడం, అందుకు తగిన ప్రశంశ పొందటం పట్ల శైలజకి అమితమైన మక్కువ. షాపింగ్ ఓ వ్యసనం అనో, దండగ మారి వ్యవహారం అనో ఎవరయినా అంటే, దాని విలువ తెలియక మాట్లాడుతున్నారని అనుకుంటుంది. ఇంటీరియర్ డిజయినింగ్ ఇండస్ట్రీ ఎంతలా పెరుగుతోందో గమనించరేంటి? ఓ చోట అలా ఆగిపోతే ఎలా? అని విసుక్కుంటుంది. తను కొనే ప్రతి వస్తువు వెనక అంతో ఇంతో శ్రమ, ఆసక్తి, అధ్యయనం ఉంటాయి కనుకనే తన షాపింగ్ అభిరుచిని ఎవరయినా తేలికగా తీసుకున్నా, పట్టించుకోకపోయినా, ప్రత్యేకంగా కాకుండా అందరితో కలిపి ఓ గాటన కట్టినా కనుకనే,

" షాపింగ్.. నీకు చాలా మామూలు పదం. ముఖ్యంగా నేను షాపింగ్ చేస్తే గంటలు గంటలు తీసుకుంటానని కావచ్చు. కానీ నా వరకు అది ఒక ఉత్సాహం, ఒక సెలబ్రేషన్! నేను కొనేది ఏమయినా కానీ, అది నా ప్రపంచంలోకి అడుగుపెడుతోంది అంటే, నా అభిరుచిని ప్రదర్శించబోతోందనే జాగ్రత్త, మమకారం నాది. ఆ ఆసక్తి కొన్ని సార్లు నాకున్న వత్తిడిని కూడా మాయం చేసుందంటే, నీకు అతిశయోక్తిగా అనిపించొచ్చునేమో కానీ, ఇది నిజం. ఒక మంచి ఆర్ట్ పీస్‌ని, లేదా మనందరికీ ఉపయోగపడే వస్తువుని కొనడంలో నాకున్న నైపుణ్యాన్ని ప్రదర్శించిన రోజున నేనెంత సంతృప్తి చెందుతానో నీకేం తెలుసు. నేను చెప్పే ఈ ఆలోచనలు నీకు ఓ పట్టాన అర్థం కావని కూడా నాకు తెలుసు కాబట్టి. ఇంతకీ నేను చెప్పొచ్చేదేమిటంటే, ఏదయినా సరే నెగిటివ్ తొందరగా తీసుకుంటాం. అమెరికాలో ఉన్న ఈ ఇండియన్సందరూ చీప్‌గా ఏది దొరికితే అది తీసుకుంటారు. వస్తువులని షాపు నుంచి తెచ్చుకుని ముప్పయి రోజుల పాటు వాడుకుని తిరిగి ఇచ్చేస్తారు అనుకోవడాన్ని నేను భరించలేను. ఎందుకంటే, వాళ్ళలో నేనొకదాన్ని! నా ఆలోచనలకి ఇటువంటి ప్రవర్తనకి పోలిక కూడా లేదు" తేల్చేసింది శైలజ

ఈ మాటలు విన్న మురళి ఓ నిట్టూర్పు విడిచి,

"నీ మాటలు వింటుంటే మనం చూసిన "Shopaholic" సినిమా గుర్తొస్తోంది. ఆ సినిమాలోలా, షాపులలో డిస్ప్లేకి పెట్టే బొమ్మలూ అవీ నీతో మాట్లాడవు కదా..? ఒక వేళ అలాంటి ప్రక్రియ ఏమైనా మొదలు పెడితే ముందు నాతో చెప్పు' ఎందుకైనా మంచిది నా జాగ్రత్తలో నేను ఉటాను. పోనీ ఓ పని చెయ్యనా, నీ స్నేహితురాలి ఫోన్ నెంబర్ నా కియ్యి. నువ్వు షాపింగ్‌లో ఎంతటి

ప్రతిభావంతురాలివో, ఎంత ధారాళంగా డబ్బులు ఖర్చు పెట్టగలవో.. బంగారు షాపులకి దేవాలయాలన్నంత భక్తిగా వెళతావని.. నేనే ఆకాశరామన్న టైపులో చెపుతాను. అప్పుడు నీ గురించి ఆమె ఏమనుకుంటుంది అన్న సమస్య ఉండదు. అయినా అమెరికాలోనే కాదు ప్రపంచంలో ఏ మూల ఉన్నా, ముందుచూపుతో, జాగ్రత్తగా వ్యవహరించడం అనేది మన ఇండియన్ ఫిలాసఫీ మన ఆర్థిక, సామాజిక నేపథ్యం' అలాంటిది. సరదాగా తీసుకోవాలి కానీ అపాదించుకోకూడదు. అమెరికాలో వినియోగదారుడంటే "కింగ్" తో సమానం. మనం చేసే కొద్దిపాటి రిటర్న్‌లకి ఆ కంపనీలేం దివాలా తీయవు... ఎంత లాభాలు ఆర్జించకపోతే అంతంత డిస్కవుంట్లు ఆఫర్ చేస్తారనుకున్నావు? డాలర్‌కి, పది డాలర్లకి  కొంటే మాత్రం నామోషీ పడేది ఏముంది.. వాడిస్తున్నాడు కష్టమర్లు తీసుకుంటున్నారు. ఎవరి నెత్తి మీద టోపీ పెట్టడం లేదుగా..?"  అన్నాడు.

"నేను చెప్పేది ఏదీ సీరియస్‌గా తీసుకోకుండా జోకులు వేస్తావు కాబట్టే, ఇలాంటి నా Passions ఏవీ నీతో పంచుకోబుద్ధి కాదు. ఎంతసేపూ అవి కొనుక్కున్నావు, ఇంత ఖర్చుపెట్టావు అంటున్నావే కానీ, మా ఆవిడకి డైమండ్స్ కొన్నాను అని చెప్పుకుని బడాయిలు పోతావే ఆ మాట ఎత్తవేంట"ంది శైలజ.

"మంచి పాయింటే పట్టుకున్నావే! అయినా ఇక నుంచి మరీ అంతలా ఎవరికి పడితే వాళ్ళకి, అలా చెప్పకూడదనుకుంటున్నాను శైలూ, ఈ ఇండియన్స్ బాగా బంగారు ఆభరణాలు గట్రా కొనుక్కుంటారు. వాటిని ఇళ్ళల్లో కూడా దాస్తుంటారని, అమెరికాలోని దొంగలు చాలామంది కనిపెట్టేసారు. ఈ మధ్య 'గోల్డ్ డిటెక్టర్స్' అనే వాటి సాయంతో బంగారం, ఇతర నగలు ఉన్న ఇళ్ళు కనిపెట్టి, దొంగతనాలకి పాల్పడుతున్నారట.. కాబట్టి ఇక్కడ నీతి ఏమిటంటే, ఖరీదయినవి కొనడమే కాదు, అలాగే వాటికి సృజనాత్మకత ఉట్టిపడే విలువ ఉండగానే కాదు అవి సురక్షితంగా ఉండే ఏర్పాట్లు చేసుకోగలగటం అన్నిటి కంటే ముఖ్యం."అనే విలువైన మాట చెప్పాడు.

## హెల్త్ ఇన్స్యూరెన్స్

**"ప్రీ ఎగ్సిస్టింగ్ కండిషన్" పేరు చెప్పి** అప్పుడే పుట్టిన పసిపిల్లకి ఓ మెడికల్ ఇన్సూరెన్స్ కంపెనీ డబ్బులు పే చెయ్యకపోవడానికి సంబంధించిన కథనం ఒకటి టీవీలో చూసిన శైలజకి పీకలదాకా కోపం వచ్చింది. ఈ ఇన్సూరెన్స్ కంపెనీలకి ఆడింది ఆట, పాడింది పాటలా ఉంది. కానీ అమెరికాలో ఉన్నంతకాలం వీటి బారినుంచి తప్పించుకోలేం కదా.. మరీ పసిపిల్లకి ప్రీ ఎగ్సిస్టింగ్ కండిషన్ ఏమిటి? ఇంత అన్యాయంగా ప్రవర్తిస్తున్నా దిక్కులేకుండా పోతోందని నానా శాపనార్థాలు పెట్టుకుంది.

నిజానికి ఇన్సూరెన్స్ కంపెనీల మీద శైలజకి ఉన్న కోపం ఈనాటిది కాదనుకోండి. మూడేళ్ళ క్రితం, వాళ్ళ అత్తగారు అమెరికా వచ్చినప్పుడు, ఎవరో సలహా ఇచ్చారు కదా అని, అలాగే ఆవిడకి ఆరోగ్యం అంతగా బాగుండదని, ఓ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నారు. ఉన్నట్టుండి ఓ రోజు అత్తగారి బీపీ అమాంతం పెరిగిపోవడం, ఎడమచెయ్యి లాగుతుండటంతో, ఎలాగూ ఇన్సూరెన్స్ ఉంది కదా చూపిద్దాం, అని అర్జంటు కేర్ కి తీసుకుపోయారు. వెళ్ళగానే వాళ్ళు ఎడ్మిట్ చేసుకుని, మారు మాట్లాడకుండా చకచకా ఆవిడకి టెస్టులు గట్రా చెయ్యడంతో పాటు, అర్జంటు కేర్‌లో ఓ బెడ్ అదీ కేటాయించి హడావిడి పడ్డారు. శైలజ అత్తగారికి తోడుగా ఉంటే,

మురళి వెళ్ళి ఇన్సూరెన్స్ పేపర్లూ అవీ వాళ్ళకి ఇచ్చి, వివరాలు చెప్పాడు. కొంతసేపటి తరువాత టెస్టుల రిజల్ట్స్ అవీ వచ్చి, ప్రమాదం ఏమీలేదని ఓ అరడజను పెయిన్ కిల్లర్లు రాసిచ్చి ఇంటికి పంపించేసారు.

ఇంటికివచ్చిన తరువాత, 'కొత్త' అనారోగ్య కారణాల వల్ల వచ్చి హాస్పిటల్లో చేరితే మీరు తీసుకున్న ఇన్సూరెన్స్‌ని కవర్ చేసేవాళ్ళం కానీ, పెద్దావిడకి అది వరకే బీపీ ఉంది కనుక ప్రస్తుతం ఉన్న ఇన్సూరెన్స్ కవర్ కాదని చెప్పారని, ఓ వైపు టెస్టులు జరుగుతున్నప్పుడు మధ్యలో ఆపితే సమస్య ఏమిటో తెలియదు కనుక పూర్తి చెయ్యమన్నానని మురళీకృష్ణ వివరించాడు. ఇన్సూరెన్స్ తీసుకునేప్పుడే అత్తగారికి షుగరు, బీపీలాంటివి ఉన్నాయని రాసినప్పుడు మధ్యలో ఈ ఫిట్టింగ్ ఏమిటో అర్ధంకాలేదు. ఈ ముక్కేదో ముందే ఏడిస్తే అప్పుడే.. ఈ ఇన్సూరెన్స్ తీసుకోవాలో మరోటి తీసుకోవాలో ఆలోచించుకునే వాళ్ళం కదా, ఆరోగ్య సమస్యలు ఉన్నాయనే కదా ఇన్సూరెన్స్ తీసుకుంది. అరవైలు దాటిన వయస్సులో, అందునా ఆరోగ్య సమస్యలు ఉన్నవాళ్ళకి వాటికి సంబంధించిన అనారోగ్యమే కదా సాధారణంగా వచ్చేది, ఈ ప్రశ్న వాళ్ళని వెయ్యలేదా? అంటూ బోలెడన్ని ప్రశ్నలు కురిపించింది శైలజ.

భారంగా నిట్టూర్చిన మురళి, అయిపోయిన పెళ్ళికి బాజాలెందుకు చెప్పు, ఇన్సూరెన్స్ కంపెనీలు వ్యాపారం చేస్తున్నాయి కానీ సమాజ సేవ అనుకోవుగా "టెక్నికల్"గా వాళ్ళ వాదనే ఎక్కువ నెగ్గుతుంది. అయినా.... తప్పు నాది కూడా, వాడిచ్చిన డాక్యుమెంట్లు సరిగా చదవకుండానే సంతకాలు పెట్టేసాను. మొదటిసారి కావడంతో పెద్ద సందేహాలేమీ రాలేదు. పైగా మనకు చెప్పిన ఫ్రెండ్స్ ఇదే ఇన్సూరెన్స్ తీసుకున్నామనడంతో నేను చాలా భరోసాగా ఉన్నాను. వాళ్ళకీ సిట్యుయేషన్ రాకపోయి ఉండొచ్చు.. లేదా తక్కువ ఖర్చుకి వస్తుందనుకుని ఉండొచ్చు. ఏది ఏమైనా, ఈ అనుభవంతో ఇకనుంచీ జాగ్రత్తగా ఉంటానని మాటిచ్చాడు. చేసేదేమీ లేక ఆ డిస్కషన్‌ని అక్కడితో వదిలేశారు కానీ, హాస్పిటల్ వాడు ఎందుకు వదులుతాడు, ఓ రెండేళ్ళపాటు బిల్లులు పంపి, తల ప్రాణం తోకకి వచ్చేట్టు చేశాడు.

ఓ అరడజను టాబ్లెట్లు ఇచ్చినందుకు అన్ని వేలు కట్టించుకున్నాడా, ఇండియాలోనే డాక్టర్లు పేషంట్లని దోచుకు తింటున్నారని అనుకుంటాం, అమెరికాలో మరీ నిలువు దోపిడీ అన్నమాట! అనే మురళీకృష వాళ్ళ అమ్మగారు, ఈ విషయం గుర్తొచ్చినప్పుడలా, కొడుకు డబ్బులు ఖర్చు అయ్యాయని బాధపడుతుంటే, మాకు తెలిసిన ఒకాయనకి అర్జంటుగా బై పాస్ ఆపరేషను చెయ్యాల్సి వచ్చి, మీకు ఖర్చయిన దానికంటే, నాలుగింతలు అయ్యింది, కనుక మీకేం పెద్దగా ఖర్చు కానట్టేనని ఆవిడతో ఎంత సర్ది చెప్పినా, ఒంట్లో బాగుండకపోతే, మనిష్టమైన డాక్టరు దగ్గరికి పోలేని అగత్యం నాకెందుకు పట్టాలి... మనిషన్నాక ఏమైనా రాకుండా ఎందుకు ఉంటుంది? అని చిరాకు పడుతూ, మళ్ళీ అమెరికా రానని ఒట్టేసుకుంది. మరి ఇంత కథ నడిచిన తరువాత, ఇన్సూరెన్స్ కంపెనీల మీద శైలజ కోపానికి వంక పెట్టలేం.

కాకపోతే మురళి మాత్రం శైలజ కోపాన్ని పెద్దగా సమర్ధించడు. ఏ దేశంలో ఉన్నప్పుడు అక్కడి పద్దతిని పాటించాలని, అందులోని మెలకువలని తెలుసుకుని, మెలుకువగా పనులు చేసుకోవాలంటాడు. ఈ దేశంలో లక్షలాది మంది ప్రజలు మెడికల్ ఇన్సూరెన్స్ లేకుండా ఉన్నారంటే, వారిలో సగం మందికి ప్రభుత్వం నుంచి అందే సహాయం గురించి, ప్రభుత్వం నడిపే, Medicaid లాంటి కార్యక్రమాలను ఎలా వినియోగించుకోవాలో అవగాహన లేకేనంటాడు. పట్టణమా లేక శివారు ప్రాంతమా?, వయస్సు, ఆరోగ్య సమస్యలు లేదా మెడికల్ హిస్టరీ వంటివి మెడికల్ ఇన్సూరెన్స్ పాలసీలని ప్రభావితం చేస్తాయి కనుక 'ఖరీదు' గురించి మనం గొడవ పెట్టి లాభం లేదంటాడు. పైగా మనం ఏ కంపెనీలో అయితే ఉద్యోగం చేస్తున్నామో ఆ కంపెనీ ఇన్సూరెన్స్ కంపెనీతో తమ ఉద్యోగస్తుల కోసం ఎంత మంచి డీల్స్‌ని రాబట్ట గలుగుతుంది అనే దాని మీద కూడా ఆధారపడి ఉంటుందంటాడు. ఇవన్నీ అటుంచి, ఎవరైనా డాక్టరు దగ్గరకి వెళ్ళినప్పుడు మాత్రం, సదరు డాక్టరు పేషెంటు ఆరోగ్య పరిస్థితిని బట్టి చికిత్స చేస్తున్నాడా, లేదా ఆ పేషెంటు ఇన్సూరెన్స్ కవర్ చేసే ప్రొసీజర్‌ని బట్టి చికిత్స ప్లాన్ చేస్తున్నాడా అనే అనుమానం మాత్రం రాకుండా ఉండదని శైలజతో తరచూ చెపుతుంటాడు. కాకపోతే

డాక్టర్లని కూడా తప్పుపట్టలేమని, సిస్టం అంతా ఇన్సూరెన్స్ కంపెనీల చేతుల్లో ఉండటంతో, ఒక రకంగా పని డాక్టర్లది, లాభాలు కంపెనీలవి అవుతున్నాయనేది కూడా మురళి అభిప్రాయం. భారతీయ సంతతికి చెందిన డాక్టర్లు కొందరు గ్రూపులుగా ఏర్పడి పెద్ద పెద్ద కమ్యూనిటీలలో సహాయపడుతున్నారనే విషయాన్ని గుర్తించక తప్పదంటాడు.

మురళి చెప్పే ఇలాంటి అభిప్రాయాలన్నీ వినే శైలజ, ఎన్ననుకుని ఏం లాభం... ఆఖరుగా నష్టం జరుగుతున్నది మాత్రం పేషెంటుకే, వేల డాలర్లు కట్టించుకుని, హాస్పిటల్ విజిట్స్ మాత్రం రాను రాను కత్తిరిస్తున్నారు. మార్కెట్ బాగుండకపోవడం వల్ల ఉద్యోగం, మెడికల్ ఇన్సూరెన్స్ పోగొట్టుకున్న మన తెలుగు అతను, బతుకు తెరువు కోసం అమెరికాలోనే ఉండిపోయాడు. వేరే దారిలేక చాలాకాలం పాటు డాక్టరు దగ్గరికి పోలేకపోవడంతో, ఆరోగ్యం పూర్తిగా పాడయ్యి, చివరికి కొంతమంది ఇండియన్ డాక్టర్లు సహాయం చెయ్యడంతో తాను జీవితపు ఆఖరి దశలో ఉన్నానని తెలుసుకున్నాడు. భార్య, చంటి బిడ్డతో సహా ఇండియా వెళ్ళిన నెలలోపే చనిపోయాడు. ఈ సంఘటన ఒక్లహామాలో జరిగింది కడుపు తరుక్కుపోదూ ఇలాంటివన్నీ వింటుంటే?

ఈ కార్పొరేటు కల్చరు, హెల్త్ ఇన్సూరెన్సులు గట్రా ఇండియాలో కూడా పెరుగుతున్నాయట! ఇక దేశం మొత్తం వ్యాపించిందనుకో, అక్కడో, ఇక్కడో ఉన్న కొద్దిమంది దయగల డాక్టర్లు కూడా పేషంట్లకి దక్కకుండా పోతారంటూ ఉంటుంది. ఏది ఏమయినప్పటికీ, మనం మొదట్లో చెప్పుకున్న, పసిపిల్లకి, "ప్రీ ఎగ్సిస్టింగ్ కండిషన్" కేసు గురించి టీవీలో వచ్చే చర్చలని, ఫాలో అప్ కథనాలని శైలజ ఆసక్తికరంగా ఫాలో అయింది. తరువాత ఏం జరిగిందంటే, తూచ్... తూచ్, ఏదో కోడింగ్ పొరపాటు కారణంగా ఆ పసిపిల్లకి పే చెయ్యలేకపోయాం తప్ప, మేం మరీ అంత మానవత్వం లేని వాళ్ళం కాదని సదరు ఇన్సూరెన్స్ కంపెనీ ఆ న్యూస్ స్టోరీ చేసిన టీవీ వాళ్ళకి ఓ వివరణ పడేసి, ఆ పిల్ల తల్లికి కలిగిన ఇబ్బందికి సారీ... చెప్పింది. పుట్టాల్సిన కవలలో ఒక బిడ్డ పోయి, రెండో బిడ్డ గుండెకు సంబంధించిన సమస్యతో బాధపడుతుంటే, తల్లడిల్లుతున్న తల్లికి, అప్పుడే పుట్టిన బిడ్డని బతికించుకోవడానికి అవసరమైన సొమ్ముకి సంబంధించి నానాతిప్పలు పెట్టడం ఇన్సూరెన్స్ కంపెనీల ధోరణికి అద్దం పడుతోందంటూ ఆ టీవీ ఛానలు న్యూస్ స్టోరీకి ముగింపు వాక్యం, పలికింది కానీ, ఇలాంటి కథనాలు దున్నపోతు మీద కురిసిన వర్షం లాంటివి అని చెపుతూ,

"ఈ మధ్య ఒబామా ప్రకటించిన కొత్త హెల్త్ పాలసీ ప్రకారం, "ప్రీ ఎగ్సిస్టింగ్ కండిషన్" సాకుగా చెప్పి, ఇన్సూరెన్సులు ఇవ్వమనడానికి వీల్లేదట! ఆ పాలసీ అమలయ్యేలోపు, అందుకు అనువైన ప్లానులు ఏమైనా ఉంటే ఎత్తిపారెయ్యటానికి ఇన్సూరెన్స్ కంపెనీలు మార్గాలు వెతుక్కుంటున్నాయ"ని ఎక్కడో చదివానని మురళితో అంది శైలజ.

"శతకోటి దరిద్రాలకి అనంతకోటి ఉపాయాలంటారు కదా.. ఇందులో పెద్ద ఆశ్చర్యం ఏముంది! ఆ పాలసీలో, సూది దూరేంత చిల్లు ఉన్నా చాలు... అమెరికా అధ్యక్షుడైనా, ఆఫ్రికా అధ్యక్షుడైనా పెట్టుబడిదారుల వ్యూహాలకి చిత్తయిపోవలసిందే." నమ్మకంగా చెప్పాడు మురళి.

# అమ్మ, నాన్న.....ఆశ్రమం!

**నవంబరు ఆఖరునుంచి,** ఇంకా చెప్పాలంటే, థాంక్స్‌గివింగ్(Thanksgiving) సెలవలనుంచి, కొత్త సంవత్సరం వచ్చేవరకు, ఆఫీసులో పనికంటే, పార్టీలు, హాలిడే ట్రిప్పులు, గెట్ టు గెదర్ల హడావిడిలోనే అమెరికాలోని చాలామంది మునిగితేలుతుంటారని చెప్పాలి. ఇలాంటి సెలవల్లోనే తమ బెస్ట్ ఫ్రెండ్స్ అనిల్ - శారదల ఫ్యామిలీతో కలిసి లాస్ వెగాస్ ట్రిప్పుకి బయలుదేరి వెళ్ళారు మురళీ కృష్ణ, శైలజల ఫ్యామిలీ. చీకటి రాత్రులలో, రంగు రంగుల వెలుగుల మధ్య వేగస్, మరో ప్రపంచానికి వచ్చామా అన్నంత అనుభూతినిస్తుండగా, పిల్లలు బాగా ఆడి, అలసి పోవడంతో శైలజ, శారద ఇద్దరూ హోటల్ రూమ్స్‌కి వచ్చేశారు. కొంచెం సేపు కాసినోలో ఆడుకుని వస్తామని చెప్పిన మురళి, అనిల్ ఇద్దరూ అర్ధరాత్రి రెండు దాటాక కానీ రాకపోవడంతో, "ఎంత పెట్టి ఆడావు? ఎన్ని డాలర్లు పోగొట్టుకున్నావు?" ఆదుర్దాగా అడిగింది శైలజ పొద్దున.

"ఆడటానికే వెళ్ళాం కానీ, పెద్ద ఆసక్తిగా అనిపించలేదు. ఏదో మాట్లాడుకుంటూ ఇద్దరికీ తెలియలేదంతే!" చెప్పాడు మురళి.

అంత టైము కూడా చూసుకోనంత లేదా తెలియనంత విషయం ఏమయి ఉంటుందో శైలజకి అర్ధం కాలేదు కానీ, తొందరగా రెడీ అయ్యి, మిగతా ప్లేసులు చూడటానికి వెళ్ళాల్సిన పని ఉండటంతో పెద్దగా ప్రశ్నలు వెయ్యలేదప్పుడు. ఇంటికి తిరిగి వచ్చిన తరువాత, తీరిక సమయం చూసుకుని, అంత దీర్ఘంగా ఏం మాట్లాడుకున్నారో అడిగింది.

"ఈవిషయం నేను కూడా నీతో చర్చించాలనుకున్నాను కానీ, ట్రిప్ మధ్యలో మాట్లాడటం మూడ్ చెడగొట్టినట్టు అవుతుందేమోనని పెద్దగా పొడిగించలేదు. మన అనిల్ వాళ్ళ పేరెంట్స్ హైదరాబాద్ లోని ఓ ఆశ్రమంలో చేరాలని నిర్ణయించుకున్నారట. ఈ మాటే చెప్పి వాడూ చాలా బాధపడ్డాడు. నలుగురూ తనని కనీసం తల్లిదండ్రులని సరిగా చూసుకోలేని కొడుకు అనుకుంటారేమోనని అవమానంగా ఫీలవుతున్నాడు, పోనీ ఉద్యోగాన్ని, గ్రీన్ కార్డుని వదిలేసుకుని వెళ్ళే సాహసమూ చెయ్యలేడు. తన పిల్లల భవిష్యత్తుని డిస్టర్బ్ చేసినట్టవుతుందేమోనని ఆందోళన పడుతున్నాడు. ఎటూ పాలుపోని పరిస్థితిలో, మనసులో బాధని వాడు చెప్పుకుంటుంటే మధ్యలో కట్ చేసి రూముకి రాలేకపోయాను." చెప్పాడు మురళి.

అనిల్ పేరెంట్స్ శైలజకి కూడా బాగా పరిచయం. వాళ్ళు అమెరికా వచ్చి వెళ్ళి ఇంకా ఆర్నెల్లు కూడా కాలేదు. అమెరికా వచ్చినప్పుడు ఇలాంటి ఆలోచనలు ఉన్నట్టు మాట వరుసకి కూడా అనకపోవడంతో, ఈ నిర్ణయం వెనుక ఉన్న నేపథ్యం ఏమిటో తనకి అర్ధం కాలేదు. ఏమైనా గొడవలు కానీ పడ్డారా? అలాంటి ఆస్కారం ఏమీలేదే? అందరూ చాలా ప్రేమగా ఉంటారు కదా?! అడిగింది శైలజ.

గొడవలు ఏమీ లేవు, వయస్సు పెరుగుతోంది. ఇంటిపనులు, బయటి పనులు చేసుకోవడం కష్టంగా ఉందట. పని వాళ్ళని ఎంతమందిని పెట్టుకున్నా ఈ మధ్య కాలంలో వాళ్ళూ డిమాండ్లు బాగా చేస్తున్నారు కాబట్టి, మేం వేగలేం, అదే ఏ ఆశ్రమంలోనో చేరితే మా వయస్సు వాళ్ళతో ఉంటాం కాబట్టి టైం పాస్ బాగా అవుతుంది. డబ్బులు కడితే అన్నీ వాళ్ళే చూసుకుంటారు, మాకూ జీవితంలో హైరానా తగ్గుతుంది అంటున్నారట. ఎంత ఖర్చయినా పంపుతాను, కావాలంటే ఒకళ్ళకి ఇద్దరు పనివాళ్ళని పెట్టుకోండంటూ సలహా ఇచ్చాడట కానీ వాళ్ళు వినడంలేదు. పైగా నువ్వేం వర్రీ అవకు. ఇప్పుడు చాలామంది తల్లిదండ్రులు ఇలాగే ఉంటున్నారు. ఇండియాలో

పిల్లలు ఉన్న తల్లితండ్రుల్లో కూడా ఈ కాలంలో స్వతంత్రంగా, విడిగా ఉండటానికి ఇష్టపడుతున్న వాళ్ళ సంఖ్య పెరుగుతోందని అంటున్నట్లుగా అనిల్ చెప్పాడని వివరించాడు మురళి.

వినడానికి వాళ్ళ ఆలోచన వాస్తవానికి దగ్గరగానే అనిపించినప్పటికీ, కానీ అనిల్ లాగానే ఆ పద్ధతికి ఒప్పుకోవడానికి ఎందుకో శైలజ మనసు వెంటనే అంగీకరించలేదు. అలాగని తకీమని ఈ సమస్యకి పరిష్కారమూ తను చెప్పలేదు.

అనేక విషయాలు చర్చించటానికి అమెరికాలో రకరకాల మీటింగులు పెట్టుకుంటారు కదా! అమెరికాలో ఉన్న తెలుగు వాళ్ళు తమ తల్లిదండ్రుల పట్ల తమకి ఎటువంటి బాధ్యత ఉందో పెద్దగా మాట్లాడుకోరెందుకని?! అంటూ దసరాకి జరిగిన బొమ్మల కొలువు పార్టీలో కలిసిన ఓ పెద్దావిడ ప్రశ్నించడం గుర్తుకు తెచ్చుకుంది శైలజ. భలే ప్రశ్నవేసారు అంటూనే, నిజానికి నేనూ అలాంటి చర్చలో ఇంతవరకూ పాల్గొనలేదు. కాకపోతే ఎవరికి వారికి వ్యక్తిగతంగా తమ బాధ్యతలు ఏమిటో తెలుస్తాయి. నాకు తెలిసి, ప్రతి ఆర్నెల్లకి పిలిపించుకోవడం, ఆర్థికంగా వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవడం, మెరుగైన సదుపాయాలు సమకూర్చడం, వీలయితే గ్రీన్ కార్డులు చేయించడం...లాంటి అనేక మార్గాలని మనవాళ్ళు ఆచరిస్తూ ఉంటారని శైలజ ఏకరువు పెట్టినప్పుడు, అంతా విన్న ఆవిడ,

"మీ పరిధి మేరకు, మీ ఆలోచనల మేరకు నా పిల్లలు లాంటి వాళ్ళు అనేక మంది ఇవన్నీ అమలు చేయటం వినటానికి బాగుంది, అలాగే నువ్వు చెప్పిన సౌకర్యాలన్నీ శరీరాలకి హాయిని ఇస్తాయేమో కానీ, మనిషికి మనసు ఒకటి ఉంటుంది చూసావూ... దానికి వీటి మీద రాను రాను ఆసక్తి తగ్గిపోతుంది. వయసు పైబడుతున్న తల్లిదండ్రులకి, ప్రతి ఆర్నెల్లకి మీ జీవితాల్లోకి తొంగి చూడటం, మీ జీవితాల్లోని కొత్త నియమ నిబంధనలు, వాటికి సంబంధించిన అర్థాలతో అనుసంధానించుకోవాల్సి రావడం, పరాయి చోట మా స్వేచ్ఛని కోల్పోవడం బోలెడంత అసౌకర్యంగా ఉంటుందనే విషయం మీరు తెలుసుకోవాలి, కడుపు తీపి కొద్దీ వస్తామే కానీ, ఇక్కడ సుఖంగా ఉన్నామని ఏనాడూ గుండెల మీద చెయ్యేసుకుని చెప్పలేం! అలాగే మా ఊళ్ళో ఉన్నప్పుడు, ఓపిక లేక, వండుకోలేక పచ్చడి వేసుకు తిని,మూలుగుతూ పడుకున్ననాడు, పిల్లలు గుర్తురాక మానరు కానీ, వెంటనే వాళ్ళ భవిష్యత్తు ఇక్కడ ఉందని గుర్తొస్తుంది. మనకి ఎంత ప్రాప్తమో అంతే దక్కుతుంది అని సర్దిచెప్పుకుంటూ, ఎవరి మీద అని నింద వేస్తాం! జీవితమే ఇక బ్రహ్మ ముడి, ఒకటి వీడితే, ఇంకోటి పడుతుంది"

అంటూ ఆవిడ నిట్టూర్చడం అప్పుడే తన కళ్ళముందు జరిగినట్టు అనిపించింది శైలజకి. నిజమే కదా! జీవితం ఎంత సంక్లిష్టమైనది. పైగా మెరుగైన భవిష్యత్తు కోసం ఆరాట పడుతూ ప్రపంచం అంతా పాకిపోయిన జాతి మనది. మన కోసం మన తల్లిదండ్రులు, మన పిల్లల కోసం మనం కష్టపడుతూ ఉన్నా, మన తల్లిదండ్రుల, లేదా వారి ముందు తరాలతో పోల్చితే, మనం తెలివైన వాళ్ళమే! అనిపించింది శైలజకి. ఇదే మాట మురళితో అంటే,

"అది సహజం శైలూ... మన కంటే మన తరువాతి తరం ఇంకా తెలివైంది. తన తల్లిదండ్రులు ఆశ్రమంలో జాయిన్ అవుతానంటే అనిల్ ఏడ్చినంత పనిచేశాడు. దాన్ని సహజంగా తీసుకోలేక, మానసికంగా వాడు ఎంత వత్తిడికి గురవుతున్నాడో ప్రత్యక్షంగా చూశాను. అదే మన పిల్లల తరానికి వచ్చేటప్పటికి అది చాలా మామూలు విషయం అవ్వడం ఖాయం. మా ఆఫీసులో జెన్నీ వాళ్ళ అమ్మని ఎల్డర్లీ కేర్ లో పెట్టింది. రోజూ ఆఫీసు నుంచి వెళ్ళేప్పుడు ఓ అరగంట వాళ్ళ అమ్మతో గడుపుతుందట. నా కంటే వాళ్ళే బెటర్‌గా చూస్తున్నారు, నేను మా అమ్మని విసుక్కోగలను వాళ్ళా పని చెయ్యలేరుగా అంటుంది. అది విన్నప్పుడు నిజమే కదా! కనీసం తల్లీ కూతుళ్ళు రోజూ తీరిగ్గా ఓ అరగంటైనా మాట్లాడుకోగలుగుతున్నారు, అదే జెన్నీ, రోజూ వాళ్ళ అమ్మని విసుక్కుంటూ పనులు చేసిందనుకో, ఆ సామరస్యం వాళ్ళ మధ్య మిగలకపోను" అన్నాడు.

"అన్నీ బాగానే ఉన్నాయి, డబ్బులేని నాడు తల్లిదండ్రుల పరిస్థితి ఏమిటి? వాళ్ళకి ఆర్థిక సహాయం కూడా చెయ్యని పిల్లల్లు, ఖర్చయిపోతుందని కనీసం ఇక్కడికి పిలవని వాళ్ళ సంగతి ఏమిటి? అయినా నువ్వు ఇండియన్ ఫీలింగ్స్ ని అమెరికన్లతో కలిపి మాట్లాడకు. కొట్టుకున్నా, తిట్టుకున్నా సరే! మన వాళ్ళకి కన్నపిల్లలు చూస్తేనే, సేవ చేస్తేనే, తృప్తి" ఆఖరు మాటగా చెప్పింది శైలజ.

"కాన్సెప్ట్ వరకు ఒప్పుకుంటాను. మనం ఉన్న పరిస్థితుల్లో అది సాధ్యమేనా? అంతదాకా ఎందుకు మన అనిల్ సమస్యకి నీ దగ్గర ఉన్న పరిష్కారం ఏమిటి? తను తిరిగి ఇండియాకి వెళ్ళలేడు.. ఎందుకంటే ఈ దేశం వాడికో కల, వాడు అనుకున్న బతుకు తెరువు ఇక్కడే ఉంది. అలా అని పేరెంట్స్ ఆశ్రమంలో చేరతానంటే ప్రెస్టేజ్! అంటే వాడి మైండ్ అమెరికాలో ఇన్ని ఏళ్ళు ఉన్నా ఇండియా దాటి రానట్టే కదా, ఇలాంటి విషయాల్లోనే నాకు చాలా కోపం వస్తుంది. ఉంటే ఇక్కడ ఉన్నట్టు బతకాలి, లేదా పూర్తిగా ఇండియాలో ఉన్న ఆలోచనలతో బతకాలి, ఎటూ కాకుండా బతికితే ఏ విధంగానూ ఉపయోగపడని టెన్షన్ తప్పితే జీవితంలో స్థిమితం ఉండదు. అన్నీ దగ్గర ఉండి చూసుకుంటేనే తృప్తి అనుకుంటే పెట్టేబేడా సర్దేసి వెళ్ళడం బెస్ట్! కష్టమో సుఖమో రెండో ఆలోచన ఉండకూడదు. అలా అనుకుని వెనక్కి వెళ్ళిన ఫ్రెండ్స్ కూడా ఎంతో మంది ఉన్నారు... నేనయితే అనిల్‌కి ఇదే సలహా చెప్పాను. నువ్వయితే ఏం చెపుతావు" అనే ప్రశ్న వేశాడు.

"ఇలాంటి నిర్ణయం నువ్వు చెపుతున్నంత ఈజీ కాదు, తాడో, పేడో వెంటనే తేల్చేయడానికి. ఫ్యామిలీ అన్న తరువాత అనిల్ మాత్రమే కాదు శారద అభిప్రాయానికి, అనిల్ తల్లిదండ్రుల మాటకి కూడా సమానమైన విలువ ఉండాలి, అందరూ కలిసి చర్చించుకుని నిర్ణయం తీసుకోవాలి. ఏకాభిప్రాయం ఉంటే బాధే లేదు! ఇక వ్యక్తిగతంగా నన్ను చెప్పమంటే, మరీ గత్యంతరం లేని పరిస్థితి అయితేనే వెనక్కి వెళ్ళమని సలహా ఇస్తా, అదనంగా ఖర్చయినా, సాధ్యమయినంత వరకు పేరెంట్స్‌ని దగ్గర పెట్టుకునే టార్గెట్ మీదే ఉండమంటా, అలా ఉంటేనే వాళ్ళకీ తనకీ కూడాతృప్తి!" అంటూ ముగించింది.

"స్టిల్ నాట్ ప్రాక్టికల్! అటు, ఇటు కాని హృదయంతోటి.." పాడుకుంటూ పనిలో పడిపోయాడు మురళి.